# వార్త

ఆదివారం

3 సెప్టెంబరు, 2023



# మామా! వచ్చేశాం..





# 'ఉస్తాద్ భగత్‌సింగ్'లో మరో కథానాయిక?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా ఇప్పుడు చేస్తున్న తాజా చిత్రాల్లో హరీష్ శంకర్‌తో చేస్తున్న మాస్ ఎంటర్‌టైనర్ చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్' ఒకటి. ఈ చిత్రం ఒక షెడ్యూల్ పూర్తి చేసుకుని మరో షెడ్యూల్‌కి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో ఇప్పటికే శ్రీలీల హీరోయిన్‌గా చేస్తుండగా తనతో పాటు మరో యంగ్ హీరోయిన్ కూడా కనిపించనున్నట్లు సమాచారం. 'ఏజెంట్', 'గాండీవధారి అర్జున' చిత్రాల్లో నటించిన హీరోయిన్ సాక్షి వైద్యను తీసుకున్నట్లు సమాచారం.

# రామ్, శ్రీలీల జంటగా 'స్కంద'



టాలీవుడ్ యంగ్ అండ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా మాస్ దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కిస్తున్న సినిమా 'స్కంద'. వీరి కాంబినేషన్‌లో వస్తున్న మొదటి సినిమా ఇది. వారికి ఇది మొదటి పాన్ ఇండియా సినిమా కావడంతో ఈ చిత్రంపై మంచి అంచనాలు ఉన్నాయి. రామ్ సరసన శ్రీలీల కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. సిల్వర్ స్క్రీన్‌వారు నిర్మాణం వహిస్తున్న ఈ చిత్రం సెప్టెంబరు 15న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

ఆదివారం వార్త

3 సెప్టెంబరు, 2023

## మంచి ముత్యాలు

అందమైనదేదినీ పోటీ ద్వారా నిర్మించలేనట్లే,
గర్వంతో ఉన్నతమైన పనులేవీ చేయలేము.

- జాన్ రస్కిన్

## విషయ విశేషం


ఇంద్రధనస్సు అందాలు.... 4

'సంఘీ'భావం....5

తీర్పుల జాప్యంతో అనర్హులకు పడని శిక్షలు

కవర్ స్టోరీ..6

మామా! వచ్చేశాం..

ఎన్నాళ్లీ హింస?..11

ఈవారం కవిత్వం..12

జాబిల్లిపై భారత్ పతాకం

పసందైన ఓనం వంటలు...18

కథ.. 20

మా వీధి

సాహిత్యం..23

ఎక్కడిదీ శివశక్తి గంగావతరణం?

సుందర పర్యాటక ప్రదేశాల దేశం థాయ్‌లాండ్...25

ఈశాన్యంలో బావి వుంటే?...29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


## తాజా వార్తలు

### మతిమరుపు పోగొట్టే సువాసనలు



మంచి నిద్రపడుతుందని చాలామంది మల్లె, జాజి వంటి పువ్వుల్ని తలలో అలంకరించుకుంటారు. లేదా మంచి వాసనల్ని వెలువరించే వేపరైజర్లనో అగరుబత్తీల్నో గదిలో పెట్టుకుని పడుకుంటారు. అంటే పరిమళం మంచి నిద్ర పట్టేలా చేస్తే, ఆ నిద్ర మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే కాలిఫోర్నియా యూనివర్సిటీ పరిశోధకులు కొందరు వృద్ధులకు ఆరునెలలపాటు రోజూ రాత్రివేళలో రెండు గంటల పాటు మంచి పరిమళాన్ని పీల్చుకునే ఏర్పాటు చేశారట. రోజ్, ఆరెంజ్, యూకలిప్టస్, నిమ్మ, పెప్పర్‌మింట్, రోజ్‌మేరీ, లావెండర్ వంటి సువాసల్ని పీల్చేలా చేయడంతో వాళ్లలో జ్ఞాపకశక్తి సమస్యలు తగ్గి, చురుగ్గా ఆలోచించగలుతున్నట్లు గుర్తించారు. ఆఘ్రాణశక్తి తగ్గినవాళ్లలో మానసిక సమస్యలు తలెత్తుతున్నాయనీ, ఆల్జీమర్స్, స్కిజోఫ్రీనియా, మతిమరుపు బారినపడ్డవాళ్లు వాసనల్ని గుర్తించలేకపోవడానికీ అదే కారణమనీ అంటున్నారు. దాంతో డిమెన్షియాకి గురైనవాళ్లకు కొన్ని రకాల వాసనల్ని రోజుకి రెండుసార్లు చూసేలా చేయగా వాళ్లలో జ్ఞాపకశక్తి, భాషా పరిజ్ఞానం పెరిగిందట. దీని ఆధారంగా వాసనకీ జ్ఞాపకశక్తికీ గాఢమైన బంధం ఉందని చెబుతున్నారు.

#### పరుపును మడతపెట్టొచ్చు

ఇంటికెవరైనా బంధువులు వచ్చినప్పుడు ఉపయోగించేందుకు లేదా అప్పుడప్పుడూ వేసుకుని పడుకునేందుకు వీలుగా ఓ మడతమంచాన్ని కొనడం..అవసరం లేదకున్నప్పుడు దాన్ని మడిచి ఓ పక్కన పెట్టేయడం చాలామంది చేసేదే. మంచం సరే..మరి దానిపైన వేసే పరువు సంగతీ..దాన్ని చుట్టినా ఎక్కడ పడితే అక్కడ పెట్టలేం. పోనీ పరువు లేకుండా వాడుకుందామనుకుంటే అంత సౌకర్యంగా ఉండదు. ఇది గుర్తించే తయారీదారులు ఇప్పుడు మంచంతో పాటు పరుపునూ ఓ సెట్‌గా తీసుకొచ్చేశారు. అంతేనా అవసరం లేదనుకున్నప్పుడు ఈ రెండింటినీ మధ్యకు మడిచి, ఏ బాల్కనీలోనో సులువుగా పెట్టేవిధంగా డిజైను చేశారు.



మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



# ఇంద్రధనస్సు అందాలు





**ఇల్లు** అందంగా కనిపించేందుకు బొమ్మల్ని అలంకరిస్తుంటాం. కాంతి కోసం రంగుల దీపాలను పెట్టుకుంటాం. కొత్తదనం కోసం ఫర్నిచర్‌ను మారుస్తుంటాం. వర్ణభరితంగా ఉండేందుకు రంగుల కర్టెన్లూ సోఫా కవర్లూ వాడుతుంటాం. అయితే ఇప్పుడు ఆ అందం, కాంతి, కొత్తదనం అన్నీ కూడా ఒకేదాంట్లో ఉండేలా చేయగలుగుతున్నారు. అంటే ఇంట్లో పెట్టుకునే అలంకరణ వస్తువులూ దీపాలూ ఫర్నిచరూ వాటిమీద వేసే ఫ్యాబ్రిక్కులతోపాటు దుస్తులూ యాక్సెసరీలూ..ఏదైనాగానీ వినూత్నమైన డిజైన్లలో హరివిల్లు రంగుల్లో కాంతిమంతంగా మెరిసేలా తయారు చేస్తున్నారన్నమాట. పైగా చూసే కోణాన్నీ దానిమీద ప్రతిఫలించే కాంతినీ బట్టి ఆ రంగులు మారుతున్నట్లుగానూ కనిపిస్తాయి. ఇంకా చెప్పాలంటే పటకంలోని రంగులన్నీ ఇంట్లో నృత్యం చేస్తున్నట్లుగా ఉంటుందన్నమాట. అదే ఇరడెసెంట్..ఇంటీరియర్ వరుసలో వచ్చిన నయాట్రెండ్. ఇరడెసెంట్..అంటే లాటిన్ భాషలో ఇంద్రధనస్సు అని అర్థం. అలాగని ఇరడసెంట్..మరీ కొత్తదేం కాదు. మనిషికి చిరకాలం నుంచీ సుపరిచితమే. ముత్యపు చిప్పలోపల ఉండే నాక్రే (మదర్ ఆఫ్ పెరల్) మీద కాంతి పడినప్పుడు అది సప్తవర్ణాల్లోకి మారుతున్నట్లుగా ఉంటుంది. అలాగే కొన్ని రకాల పక్షులూ సీతాకోక చిలుకలూ పురుగుల రెక్కల్లోనూ రంగులు కాంతిమంతంగా మెరుస్తుంటాయి. ప్రకృతిలో సహజంగా కనిపించే ఈ ప్రక్రియనే ఇప్పుడు వస్తువుల్లోకీ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నమాట. సాధారణంగా ఇంట్లోని ఫర్నిచర్‌ను చెక్కతో చేస్తుంటారు. అయితే ఇరడెసెంట్ రంగులకోసం ఎక్కువగా అక్రిలిక్, గాజు, ప్లాస్టిక్, రెజిన్‌ను పలుచని పొరలుగా రూపొందించి వాడుతున్నారు. ఆ తరువాత అల్యూమినియం సిలికేట్‌లో మైకా పొడిని కలిపి పెయింట్ చేయడం ద్వారా ఈ ఎఫెక్ట్ తీసుకొస్తున్నారు.







# 'సంఘీ' భావం



## తీర్పుల జాప్యంతో అనర్హులకు పడని శిక్షలు

**రా**జకీయపరమైన కోర్టు కేసుల్లో తీర్పులు తీవ్రజాప్యంతో వెలువడుతూ ఉండటంతో అనర్హులు శిక్షల నుంచి తప్పించుకునే అవకాశం కలుగుతోంది. ఎన్నికల నియమావళిని కఠిన తరమైన నిబంధనలతో రూపొందించారు. ఓటర్లకు అభ్యర్థులపై స్పష్టమైన అవగాహన, అతని ఆస్తులు, కేసుల విషయంలో తగిన సమాచారం కలిగి ఉండేలా చర్యలు తీసుకున్నారు. నామినేషన్ దాఖలు సమయంలో ఆస్తులు, నేరాలకు సంబంధించిన కేసులకు సంబంధించిన అనేక అంశాలను స్పష్టంగా పేర్కొనాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఎవరైనా ఉల్లంఘనలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకోవడానికి వీలు కల్పించారు. ఒకవేళ ఏదైనా అభ్యర్థి తప్పుడు అఫిడవిట్ దాఖలు చేస్తే వాటిపై పరిశీలన జరిపే వ్యవస్థ విషయంలో నిబంధనల్లో స్పష్టత లేకపోతే ప్రత్యర్థులో, లేక మరొకరో అఫిడవిట్‌లో లోపాలు గుర్తించి న్యాయస్థానాన్ని ఆశ్రయించే వరకు వీటిని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఒకవేళ కోర్టును ఆశ్రయిస్తే తీర్పు వచ్చే సరికి ఐదేళ్లకు పైగా పడుతోంది. ఈలోగా సదరు అభ్యర్థి ఎమ్మెల్యేగానో, ఎంపీగానో పదవీ కాలాన్ని పూర్తిగా అనుభవించడం జరుగుతోంది. దీనివల్ల కోర్టు తీర్పు వచ్చినా ఫలితం ఉండటం లేదు. తాజాగా తెలంగాణలో కొత్తగూడెం శాసనసభ్యుడు వనమా వెంకటేశ్వరరావు, గద్వాల శాసనసభ్యుడు బి.కృష్ణమోహన్‌రెడ్డిలు తప్పుడు అఫిడవిట్‌లు దాఖలు చేశారని న్యాయస్థానాలు గుర్తించాయి. మరో రెండు నెలల్లో ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఈ తీర్పులు వెలువడటం వల్ల ఫలితం ఉండటం లేదు. వనమా స్థానంలో జలగం వెంకట్రావుకు ఎమ్మెల్యేగా కొనసాగాలని కోర్టు స్పష్టం చేసింది. అయితే ఇప్పటి వరకు జలగం రాజకీయ కారణాల వల్ల ప్రమాణం చేయలేదు. ఇక్కడ ఇద్దరూ ఒకేపార్టీకి చెందిన వారు కావడంతో కోర్టు ఉత్తర్వులు అమలుకాలేదు. ఒక గద్వాలలో బిజెపికి చెందిన డికె అరుణకు ఎమ్మెల్యేగా కొనసాగించాలని కోర్టు ఆదేశించింది. మరోపక్క ప్రస్తుతం మంత్రిగా ఉన్న శ్రీనివాసగౌడ్ తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారని మహబూబ్ నగర్‌కు చెందిన రాఘవేంద్రరాజు కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను కొట్టివేయాలని మంత్రి హైకోర్టును ఆశ్రయించగా మంత్రి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. అదేవిధంగా జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి గెలిచిన ఎంపీ బీబీ పాటిల్ పై మదన్‌మోహన్‌రావు అనే వ్యక్తి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ హైకోర్టు రోజువారీ విచారణకు ఆదేశించింది. దీనిని సవాల్ చేస్తూ పాటిల్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అయితే ఆయన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టి వేసింది. ఇక వేములవాడ ఎమ్మెల్యే రమేష్ పౌరసత్వంపై కోర్టు కేసు కొన్ని సంవత్సరాల తరబడి కొనసాగుతూనే ఉంది. అయితే ఇప్పటి వరకు దీనిపై పూర్తి స్థాయి తీర్పు వెలవడలేదు. ఇలాంటి కేసులు రెండు రాష్ట్రాల్లో అనేకం ఉన్నాయి. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి అఫిడవిట్‌ను ప్రత్యర్థులు పరిశీలించి వివరాలు సేకరించి కోర్టులో అన్ని ఆధారాలతో పిటిషన్ దాఖలు చేస్తే దానిని రుజువు చేసేందుకు కనీసం ఐదేళ్ల సమయం పడుతోంది. ఇక ఎన్నికల్లో పరాజ యం పొందిన వారు ఎంతమంది తప్పుడు అఫిడవిట్‌లు దాఖ లు చేశారన్నదానికి లెక్క లేకుండా పోయింది. కోర్టు తీర్పులు జాప్యం జరుగుతూ ఉండటంతో తప్పుడు అఫిడవిట్‌ను ఉద్దేశ్య పూర్వకంగా దాఖలు చేయడానికి రాజకీయ నేతలు ఏమాత్రం వెనుకాడటం లేదు. సాధారణ పౌరులు విదేశాలకు వెళ్లడానికి వీసా కోసం దరఖాస్తు చేసుకుంటే ముందుగానే అనేక విచారణలు చేపట్టిన తరువాతే అధికారులు అనుమతులు జారీ చేస్తున్నారు. చివరకు పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్నా పోలీసు విచారణ తరువాతే పాస్‌పోర్టుకు క్లియరెన్స్ ఇస్తున్నా రు. ఇక ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక అయిన తరువాత కూడా సదరు వ్యక్తిపై ఎటువంటి క్రిమినల్ కేసులు లేవని నిర్థారించుకున్న తరువాతే నియామకపు ఉత్తర్వులు ఇస్తున్నారు. అయితే ఈ విధానం చట్టసభలకు ఎంపిక అవుతున్న అభ్యర్థుల విషయంలో మాత్రం అమలుచేయలేకపోతున్నారు. తప్పుడు సమాచారంతో ఎన్నికల బరిలో దిగుతున్న వారి సంఖ్య అత్యధికంగా ఉంటోంది. వీటిని కట్టడి చేయడానికి ఎటువంటి చర్యలు లేకుండా పోతున్నాయి. తప్పుడు అఫిడవిట్‌లను సమర్పించే అభ్యర్థులకు రెండేళ్ల జైలు శిక్ష, ఆరు సంవత్సరాల పాటు ఎటువంటి ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం అమలు చేయాలని డిమాండ్‌లు వినిపిస్తున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. కనీసం కమిటీని నియమించి అఫిడవిట్‌లపై పరిశీలన జరపాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. శాసనాలను అమలుచేసే చట్టసభలు తమ అంతర్గతంగా జరుగుతున్న లోపాలను పూర్తిస్థాయిలో సరిదిద్దుకునేందుకు అంతగా శ్రద్ధ చూపడం లేదు. కారణం అధికారంలో ఉన్న వారిలో చాలామంది ఇలాంటి తప్పిదాలు చేసిన వారే కాబట్టి ఆశించిన ఫలితం కనిపించడం లేదు. తీవ్రమైన నేరాలు చేసిన వారు సైతం ఆ వివరాలను అఫిడవిట్‌లో చూపించ కుండా చట్టసభలకు ఎన్నిక అవుతున్నారు. కొన్ని సందర్భాల్లో వాటిని రుజువుచేస్తూ న్యాయస్థానాల్లో విచారణ జరుగుతోంది. తప్పిదాలకు సంబంధించిన డాక్యుమెంట్లను ప్రవేశపెట్టినా తీర్పు వెలువడటంతో తీవ్ర జాప్యం నెలకొంటోంది. దీనితో సదరు నిందితులు ఐదేళ్ల కాలం పాటు పదవిని అనుభవిస్తున్నారు. ఇలాంటివి భవిష్యత్తులో పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవడానికి చట్టసభలు దృష్టిసారించాలి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# మామా! వచ్చేశాం..

కవర్‌స్టోరీ

పర్వతరెడ్డి శ్రీనివాసులురెడ్డి,
ప్రభాతవార్త, శ్రీహరికోట

'గ్రహాంతర పరిశోధనల్లో అగ్ర దేశాలతో పోటీపడాలనే ఉత్సాహం లేదు. కానీ సామాన్యుడి కష్టాలను తీర్చేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంలో ఇతర దేశాలన్నింటి కంటే ముందు ఉండాలన్నదే మా ఏకైక లక్ష్యం'. ఆరు దశాబ్దాల ముందు భారత అంతరిక్ష పరిశోధ నల పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ అన్న మాట లివి. అయితే కేవలం గగనతలంలో ఘన విజయాలే కాకుండా గ్రహాలపై కూడా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ విజయవంతమైన ప్రయోగాలు చేపట్టింది. చంద్రయాన్, మంగళయాన్ ప్రయోగాల విజయంతో ప్రపంచ దేశాల దృష్టిని సైతం ఇస్రో ఆకర్షించింది. విక్రమ్ సారాభాయ్ ఆశయాలకు అనుగుణంగా ప్రారంభంలో ఒడిదుడుకులు ఎదు రైనప్పటికీ ముందుకు సాగుతున్న అంతరిక్ష పరిశోధనలు చంద్రయాన్-3తో సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టినట్లయింది. విక్రమ్ సారాభాయ్ పేరులోని విక్రమ్ పేరుతోనే చంద్రయాన్-3లో విక్రమ్ ల్యాండర్‌ను శాస్త్రవేత్తలు రూపొందించి విజయవంతంగా ప్రయోగించారు. 2023, ఆగస్టు 23న సాయంత్రం 6.04 గంటలకు విక్రమ్ ల్యాండర్ ఇంతవరకూ ఏ దేశమూ టచ్ చేయని జాబిల్లి దక్షిణ ధ్రువంపై సాఫ్ట్ ల్యాండింగ్ అయ్యింది. ఆ క్షణాన భారతావని పులకించి పోయింది. ఆ రోజుకు మరింత విలువ ఇవ్వాలని భారత ప్రధాని నరేంద్రమోడీ ఇక ప్రతి ఏడాది ఆగస్టు 23ను 'నేషనల్ స్పేస్ డే'గా ప్రకటించారు. జూలై 14న సతీష్‌ధవన్ స్పేస్‌సెంటర్ (షార్)లోని రెండవ ప్రయోగ వేదిక నుంచి ఎల్‌వీఎం3 ఎం4 రాకెట్ ద్వారా చంద్రయాన్-3 అంతరిక్షంలోని నిర్దేశిత కక్ష్యలో ప్రవేశించింది. అనంతరం ఐదు దశల్లో భూకక్ష్యలోనూ, మరో ఐదు దశల్లో చంద్ర కక్ష్యలోనూ పరిభ్రమించి ఎట్టకేలకు అత్యంత భద్రంగా, క్షేమంగా చంద్రునిపై వాలింది. గ్రహాల పరిశోధన మనకు కొత్త కాదు. ఇంతకుముందు రెండు చంద్రయాన్‌లను ప్రయోగించి ఉన్నారు. ఒక మంగళయాన్‌ను తక్కువ ఖర్చు తోనే ప్రయోగించారు. అంతరిక్ష పరిశోధనల్లో పూర్తిగా స్వావలంబన సాధించాలనే విక్రమ్ సారాభాయ్ ఆశలను నెరవేర్చడానికి ఇస్రోకు ఎంతోకాలం అవసరమైంది. అయితే అపజయా లను సోపానాలుగా మార్చుకొని విజయాల బాట పట్టిన తర్వాత ఒకవైపు అగ్రదేశాలకు పోటీ ఇస్తూనే మరో వైపు అంతరిక్ష ప్రయోగ కేంద్రాలు లేని దేశాల ఉపగ్రహాలను ఎన్నింటినో మన రాకెట్ ప్రయోగ కేంద్రం శ్రీహరికోట నుంచి ఎప్పటికప్పుడు ప్రయోగిస్తూనే ఉన్నారు. వాణిజ్య లాభాల ఆర్జనతో పాటు దేశంలోని ఉత్సాహవంతులైన ప్రైవేటు పెట్టుబడులను కూడా ఆహ్వానిస్తున్నారు. కేంద్రప్రభుత్వ సహకారం ఇందుకు తోడయ్యింది. చంద్రయాన్-3 ప్రయోగంతో రష్యా కూడా సాధించలేని జాబిల్లి దక్షిణ ధ్రువంపై దిగే సామర్థ్యం మనకుందని నిరూపించుకోవడం ఈ శతాబ్దంలో ఒక మరచిపోలేని మధుర ఘట్టంగా దేశంలోని మేధావులు సైతం కొనియాడుతున్నారు. అంతరిక్ష పరిశోధనలు అంటే అంత తేలికైనది కాదు. ఆరు దశాబ్దాల భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇంతింతై వటుడింతై అన్నట్లు పెరగడానికి ఎంతోమంది శాస్త్రవేత్తలు అవిరళ కృషి చేశారు.

## ఎన్నో మార్పులు, చేర్పులతో...

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఏర్పడటానికి ఏ ఒక్క రోజులోనో, ఒక్క సంవత్సరంలోనో సాధ్యం కాలేదు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆటోమేటిక్ ఎనర్జీ పేరుతో ఉన్న సంస్థ అంచలంచెలుగా ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)గా రూపాంతరం చెందడానికి అప్పటి శాస్త్రవేత్తల, రాజకీయ ప్రముఖుల ముందుచూపుకు తార్కాణంగా నిలిచింది. ఆరు దశాబ్దాల క్రితం అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ అంతరిక్ష విజ్ఞానంలో పనిచేస్తున్న ముఖ్యులతో మన సొంత వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్న ప్రతిపాదన తెచ్చారు. అప్పటికి భారతదేశం ఇంకా పేద దేశమన్న ప్రచారం ప్రపంచంలోనే ఉంది. అయితే నెహ్రూ ఆశలకు విక్రమ్ సారాభాయ్, ఎంజికె మీనన్ లాంటివారు ప్రారంభంలోనే ఊపిరి పోశారు. ఈ నేపథ్యాన ఎడ్లబండ్లు, సైకిళ్లు వంటి వాటిపై రాకెట్లు మోసుకెళ్లి త్రివేండ్రంలోని తుంబా ఈక్వటోరియల్ రాకెట్ స్టేషన్‌కి తీసుకెళ్లే వారు.

1963 నవంబర్ 21న మొదటి సౌండింగ్ రాకెట్ తుంబా నుంచి ప్రయోగించారు. ఈ చారిత్రక సంఘటన జరిగి 50 ఏళ్లు అవుతోంది. అప్పటి నుంచి భారత అంతరిక్ష పరిశోధన యజ్ఞం ఎన్నో మలుపులు తిరిగింది. 1965లో స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్ తుంబాలోనే ప్రారంభించారు. 1967లో అహ్మదాబాద్‌లో ఉపగ్రహాల నియంత్రణ పరిజ్ఞానానికి సంబంధించిన యాంటెన్నాల అభివృద్ధికి శ్రీకారంచుట్టారు. అప్పటి ప్రధానమంత్రి నెహ్రూ అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీని నేరుగా సందర్శించి శాస్త్రవేత్తలను ఉత్సాహపరిచారు. అనంతరం 1969లో ఆగస్టు 15న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ప్రారంభించారు. ఇప్పటికి ఇస్రో ప్రారంభమై 55వ ఏడు నడుస్తోంది.

### శ్రీహరికోటకు శ్రీకారం

తుంబా కాకుండా అన్ని విధాల అంతరిక్ష ప్రయోగాలకు అనుకూలమైన ప్రాంతాన్ని అంతరిక్ష పరిశోధన రంగ ప్రముఖులు ఎదుగుతుంటే ఒక బృందం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అప్పటి నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటకు సమీపంలో ఉన్న శ్రీహరికోట దీవులను చేరుకుంది. ఒకవైపు బంగాళాఖాతం సముద్రం, మరోవైపు పులికాట్ సరస్సు వల్ల జలంతో నిండిన ఈ ప్రదేశానికి మధ్యలో శ్రీహరికోట దీవి ఉంది. ఆ దీవిలోని 18 గ్రామాలను ఇతర ప్రాంతాలకు పునరావాసం కింద తరలించి విక్రమ్ సారాభాయ్ ఆధ్వర్యాన శ్రీహరికోటలో అంతరిక్ష ప్రయోగ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 1971 అక్టోబర్‌లో శ్రీహరికోట హై ఆటిట్యూడ్ రేంజ్ (షార్ కేంద్రం) ఏర్పడగా, 2003 అక్టోబర్‌లో సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ (షార్)గా ఇది రూపాంతరం చెందింది. ఇదిలావుంటే డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ (డిఓఎస్) 1972 జూన్‌లో ఏర్పడగా, దీనికి ఇస్రోను జత చేశారు. మొట్టమొదట ప్రొఫెసర్ సతీష్‌ధవన్ డిఓఎస్ సెక్రటరీగాను, ఇస్రో ఛైర్మన్‌గాను బాధ్యతలు స్వీకరించారు. 1972లోనే అహ్మదాబాద్‌లో అతి ముఖ్యమైన స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఎస్ఎసి) ప్రారంభమైంది. ఉపగ్రహాల తయారీకి బెంగళూరులో మరొక కీలకమైన శాటిలైట్ తయారీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. 1975 ఏప్రిల్ 19న మొట్టమొదటి భారతీయ ఉపగ్రహం ఆర్యభట్టను యుఎస్ఎస్ఆర్ నుంచి ప్రయోగించారు. అదే తరహాలో భాస్కర్-1 కూడా బయట దేశంలోని అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించారు. ఆ తర్వాత అసలు కథ మొదలైంది.

### శ్రీహరికోట నుంచే రాకెట్ల ప్రయోగం

శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి సొంతంగా రాకెట్ల ప్రయోగాలు చేపట్టడం 1979 నుంచి ఇస్రో ప్రారంభించింది. ఎస్ఎల్‌వి3 పేరుతో జరిగిన మొదటి ప్రయోగం విఫలమైనప్పటికీ ఆ తర్వాత ఎస్ఎల్‌వి3ల విజయాన్ని శాస్త్రవేత్తలు చవిచూశారు. అనంతరం ఎఎస్ఎల్‌వి, పిఎస్ఎల్‌వి, జిఎస్ఎల్‌వి, జిఎస్ఎల్‌వి మార్క్3, ఎల్‌విఎం3, ఎస్ఎస్ఎల్‌వి సిరీస్‌లలోని వివిధ డిజైన్ల మార్పులు చేర్పులతో రాకెట్లు రూపొందించి శ్రీహరికోట నుంచి ప్రయోగిస్తున్నారు. ఇప్పటికి ఆదిత్య ఎల్1 ప్రయోగంతో కలిపి షార్ నుంచి మొత్తం 91 రాకెట్లను ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగించారు. వీటిలో మన దేశ అభివృద్ధికి సంబంధించిన వివిధ రాకెట్లతో పాటు విదేశీ ఉపగ్రహాలు, కొన్ని విశ్వవిద్యాలయ కళాశాలల విద్యార్థులు రూపొందించిన ఉపగ్రహాలు కూడా ఉన్నాయి. అందులో భారత్‌కు ప్రపంచ ఖ్యాతి తెచ్చిన చంద్రయాన్-3 ప్రయోగం 89వది.




ప్రైవేటు సంస్థల రాకతో మరింత ఊపు ఇస్రో ప్రైవేటు సంస్థల పెట్టుబడులను ఆకర్షించింది. నాలుగేళ్లలో 150 ప్రైవేటు సంస్థలు తమ రాకెట్లను ఇస్రో ఆధ్వర్యంలో ప్రయోగించడానికి ముందుకు వచ్చినట్లు ఇటీవలే ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రకటించారు. మొదట నాలుగు సంస్థలతో మొదలైన ఈ ప్రైవేటు ఉద్యమం అంతలోనే 150 స్టార్టప్‌లకు చేరడం దేశంలో అంతరిక్ష విజ్ఞానంపై పెరుగుతున్న అంచనాలకు నిదర్శనంగా మారింది. ప్రస్తుతం శ్రీహరికోటలో ఒక ప్రైవేటు సంస్థకు వారి రాకెట్లు ప్రయోగించుకోవడానికి అనుకూలంగా ప్రయోగ వేదిక నిర్మించుకునేందుకు స్థలం కూడా ఇస్రో వారు అప్పగించారు. గత ఏడాది హైదరాబాద్‌లోని స్కై రూట్ సంస్థ మొట్ట మొదటగా తమ ప్రైవేటు రాకెట్‌ను షార్ నుంచి విజయవంతంగా ప్రయోగించింది. హైదరాబాద్‌లోనే ధ్రువాస్ వంటి ఉపగ్రహాల తయారీ కేంద్రాలు కూడా వెలిశాయి. తమిళనాడులో అగ్నికుల్ తదితర స్టార్టప్‌లు పదేపదే రాకెట్లు ప్రయోగించడానికి ఇస్రో సహకారాన్ని అర్థించాయి. ఇతర దేశాల అంతరిక్ష శాస్త్రవేత్తలను ఆకర్షించేందుకు ప్రైవేటు సంస్థలు కూడా ఉపయోగపడతాయని ఇస్రో వర్గాలు నమ్ముతున్నాయి. దీనికి తగ్గట్లే కేంద్రప్రభుత్వ పెద్దలు సైతం ఇక్కడి ప్రైవేటు స్టార్టప్‌ల యాజమాన్యాన్ని విదేశాలకు తమతో తీసుకెళ్లి అంతరిక్ష ప్రయోగ కేంద్రాలు లేని దేశాలతో మాట్లాడిస్తున్నాయి.

ప్రైవేటు పెట్టుబడుల వల్ల రాకెట్ ప్రయోగాలు మరింత ఎక్కువ సంఖ్యలో జరుగుతాయని, వివిధ రంగాలకు ఉపయోగపడే ఉపగ్రహాల నిర్మాణం సైతం ఊపందుకుంటుందని ఇస్రోపెద్దలు భావిస్తున్నారు.

### ఇస్రోలో 20 వేలమందికి పైగా..

భారత అంతరిక్ష పరిశోధన సంస్థలో 20 వేలమందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. దేశంలోని ఇస్రో ప్రధాన కార్యాలయాలతో పాటు చిన్నా పెద్దవి కలిపి 18 కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ప్రత్యేకించి బెంగళూరులో ఇస్రో ప్రధాన కార్యాలయం ఉంది. శాటిలైట్లను తయారు చేసే యుఆర్‌రావు స్పేస్‌సెంటర్‌లో ఏకంగా 3500 మంది పనిచేస్తున్నారు. కేరళలోని తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో 4వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ కేంద్రం భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు పురుడు పోసుకున్న నేల. దీనికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇప్పటికీ అక్కడ రాకెట్ల తయారీలో కీలక దశలు నిర్మిస్తున్నారు. అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్‌లో మూడువేల మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. గుజరాత్ రాష్ట్రానికి ఈ కేంద్రం అత్యంత కీలకమైనది. ఉపగ్రహాల నియంత్రణ కోసం ఇక్కడ అత్యాధునిక విలువైన పరికరాలను తయారు చేస్తారు. ఇక శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ స్పేస్‌సెంటర్‌లో సుమారు 2500 మంది పనిచేస్తున్నారు. ఇది రాకెట్ ప్రయోగ కేంద్రం. ఉపగ్రహాలు ఎక్కడ నిర్మాణం జరిగినా ప్రయోగించాల్సిన స్థలం మాత్రం షార్‌దే. తమిళనాడుకు చెందిన మహేంద్రగిరిలోని ఎల్‌పిఎస్‌సి సెంటర్‌లో 1500 మంది పనిచేస్తుంటారు. రాకెట్ల లో ఉపయోగించే ద్రవ ఇంధనాన్ని ఇక్కడి నుంచే తీసుకొస్తారు. హైదరాబాద్‌లో ఎన్‌ఆర్‌ఎస్‌సి కేంద్రంలో 1200 మంది పని చేస్తుంటే ఇక్కడ నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సరికొత్త ఆవిష్కరణలకు కారణమవుతోంది. బెంగళూరులోని ఇస్ట్రాక్ సెంటర్‌లో 500 మంది పనిచేస్తుంటే అంతరిక్షంలోకి పంపిన ఉపగ్రహాలను ఇక్కడి భూకేంద్రం నుంచే నియంత్రిస్తారు. చంద్రయాన్–341రోజుల సుదీర్ఘ ప్రయాణం మొత్తాన్ని ఇస్ట్రాక్ కేంద్రం నియంత్రించింది. బెంగళూరు వద్ద ఉన్న మాస్టర్ కంట్రోల్ ఫెసిలిటి (ఎంసిఎఫ్) కేంద్రంలో 350 మంది పని చేస్తున్నారు. లిక్విడ్ ప్రొపల్షన్ శాటిలైట్ సెంటర్ సైతం ఇక్కడ ఉండగా, 200 మంది అందులో పనిచేస్తున్నారు. త్రివేంద్రం లోనే మరొక ఐపిఆర్‌సి సెంటర్ ఉంది. ఇక్కడ 600 మంది ఉద్యోగులు ఉన్నారు. ఐఐఎస్‌యులో 400 మంది, తిరుపతి సమీపంలోని గాదంకి ఎంఎఎల్ కేంద్రంలో 100 మంది దాకా ఉద్యోగులు ఉన్నారు. రిమోట్ సెన్సింగ్ ఆపరేషన్ల కోసం డెహ్రాడూన్‌లో ఉన్న కేంద్రంలో 400 మంది, అస్సాంలోని గౌహతిలో 200 మంది ఉద్యోగులు ఉన్నారు. మొత్తంమీద దేశం నలుమూలలా ఇస్రో కేంద్రాలు ఉన్నాయి. అందులో సింహభాగం దక్షిణాదిలోనే ఉండటం విశేషం. ఈ కారణం చేత ప్రధాని నరేంద్రమోడీ ఇటీవల మాట్లాడుతూ చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్–3 విజయవంతంగా దిగిందని, మన దేశంలోని దక్షిణాది రాష్ట్రాల నుంచి ఇస్రో కేంద్రాలు విజయవంతంగా పనిచేశాయని కొనియాడారు.



### బహుముఖ ప్రజ్ఞాశాలి విక్రమ్ సారాభాయ్



చంద్రయాన్–3 ప్రయోగం విజయం తర్వాత విక్రమ్ సారాభాయ్ పేరు దేశం మొత్తం మార్మోగిపోతోంది. అంతరిక్ష పరిశోధన పితామహునిగా ఆయనకు పేరుంది. విక్రమ్ అంబలాల్ సారాభాయ్ బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన పేరుతో త్రివేంద్రం లోని ఇస్రో కేంద్రానికి విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ అని నామకరణం ఉంది. శ్రీహరికోట దీవిని అంతరిక్ష ప్రయోగ కేంద్రంగా ఎంపిక చేసిన ఘనత ఆయనదే. అప్పట్లో ఇటువంటి అనుకూలమైన కేంద్రం దొరకడం తమకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని సారాభాయ్ పదేపదే చెప్పుకునే వారు. తన బృందంలోని శాస్త్రవేత్తలతో కలిసి ఎగిరి గంతేసినంత పని చేసినట్లు అప్పటి పెద్దలు చెప్తుంటారు. సూళ్లూరుపేట పట్టణం నుంచి శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రానికి వేసిన రహదారికి విక్రమ్ సారాభాయ్ మార్గంగా పేరుపెట్టారు. చంద్రయాన్–3లో సారాభాయ్ పేరులోని విక్రమ్ పేరుతోనే విక్రమ్ ల్యాండర్ రూపొందించారు. జాబిల్లి దక్షిణ ధ్రువాన్ని ముద్దాడింది ఈ విక్రమ్ ల్యాండరే. భారత అంతరిక్ష పరిశోధనల పితామహుని గానే కాకుండా కాస్మిక్ కిరణాల అధ్యయనవేత్తగా, అణు పరిశోధనలకు దేశంలో శ్రీకారంచుట్టిన మహామనిషిగా ఆయనకు గుర్తింపు ఉంది. పారిశ్రామికవేత్తగా, పరిశోధన కేంద్రాల వ్యవస్థాపకుడిగా, విద్యావేత్తగా, కార్యనిర్వహణదక్షుడిగా మాత్రమే కాకుండా గొప్ప మానవతావాదిగా కూడా విక్రమ్ సారాభాయ్ చరిత్రలో నిలిచిపోయారు.

1919 ఆగస్టు 12న అహ్మదాబాద్‌లో జన్మించిన విక్రమ్ సారాభాయ్ డిఓఎస్ అధ్యక్షునిగాను, ఇస్రో ఛైర్మన్‌గాను వివిధ పరిశోధనలకు శ్రీకారంచుట్టారు. తక్కువ ఖర్చుతో అంతరిక్ష పరిశోధనలు, ప్రయోగాలు చేయాలని మొదటి నుంచి ఆయన బడ్జెట్‌ను కట్టుదిట్టంగా అమలు చేశారన్న పేరుంది.

సారాభాయ్ చేసిన సేవలకు గుర్తింపుగా 1962లో ఫిజిక్స్‌లో శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు, 1966లో పద్మభూషణ్ అవార్డు, కేంద్రప్రభుత్వం ఇచ్చి సత్కరించింది. సారాభాయ్ మరణానంతరం భారత ప్రభుత్వం ఆయనకు పద్మభూషణ్‌ను ప్రకటించింది.

## 3 లక్షల 84 వేల కిలోమీటర్ల ఉత్కంఠ భరిత ప్రయాణం

చంద్రయాన్-3 ప్రయోగ విజయాన్ని దేశ ప్రజలు పండగలా జరుపుకుంటు న్నారు. అయితే 41 రోజుల ఈ రాకెట్ ప్రయాణం అంత తేలికగా జరగలేదు. శాస్త్రవేత్తలు రేయింబవళ్లు శ్రమించి విక్రమ్ ల్యాండర్‌ను సాఫ్ట్ ల్యాండింగ్ చేసేదాకా విశ్రమించలేదు. జూలై 14న శ్రీహరికోటలోని రెండవ ప్రయోగ వేదిక నుంచి ఎల్‌విఎం3 ఎం4 రాకెట్ ద్వారా 3900 కిలోల బరువు ఉన్న చంద్ర యాన్-3ని ప్రయోగించారు. అప్పట్లో ఈ రాకెట్ శాస్త్రవేత్తలు నిర్దేశించిన కక్ష్యలో చంద్రయాన్3ని ప్రవేశపెట్టింది. ప్రొపల్షన్ మాడ్యూల్, విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌తో కూడిన చంద్రయాన్-3 లో ఆరు కీలకమైన పేలోడ్లను అమర్చి ఉన్నారు. ఈ ఉపగ్రహాన్ని భూకేంద్రాల నుంచి శాస్త్రవేత్తలు నియంత్రించారు. చంద్రయాన్-3లోని ద్రవ ఇంధనాన్ని ఎప్పటికప్పుడు మండిస్తూ భూ కక్ష్యను ఐదుసార్లు పెంచుకుంటూపోయారు. ఆ తర్వాత చంద్ర కక్ష్యలో ప్రవేశించిన ఉపగ్రహాన్ని మరో ఐదుమార్లు కక్ష్య తగ్గిస్తూ చంద్రుని సమీపానికి తీసు కెళ్లారు. అక్కడ ప్రొపల్షన్ మాడ్యూల్ విక్రమ్ ల్యాండర్‌ను వేరుచేసింది. విక్రమ్ ల్యాండర్‌లో ఉన్న ప్రజ్ఞాన్ రోవర్ జాబిల్లి దక్షిణధ్రువంపై దిగే దాకా అత్యంత సంక్లిష్ట దశను దాటుకొని ఆగస్టు 23న సాయంత్రం 6.04 గంటలకు జాబిల్లి దక్షిణ ధ్రువంపై ప్రపంచంలోనే తొలిసారిగా భారతీయ పరిశోధనలు మొదలయ్యాయి. అప్పటిదాకా ఉత్కంఠ, ఉద్వేగ క్షణాలను అనుభవించిన శాస్త్రవేత్తలు దేశ ప్రజలకు పండగ వాతావరణం తీసుకొచ్చారు. ఈ ప్రయాణంలో ఎన్నో ఆసక్తికర మలుపులు ఉన్నాయి. ఉపగ్రహం చుట్టూరా తిరగడమే కాకుండా వేగ నియంత్రణలో గతంలో ఎన్నడూ లేని పరిణామాలను ఎదుర్కొన్నారు. రాకెట్ ప్రయోగ సమయాన సెకనుకు 10 కిలోమీటర్లు దూరం ప్రయాణించే రోజు నుంచి సాఫ్ట్ ల్యాండింగ్ జరిగేటప్పుడు సెకనుకు 0.5 కిలోమీటర్ల వేగంతో కిందికి దిగడం ఈ వేగ నియంత్రణలో సాధించిన విజయం. ప్రస్తుతం 26 కిలో గ్రాముల బరువు ఉన్న ప్రజ్ఞాన్ రోవర్ ఎప్పటికప్పుడు జాబిల్లి దక్షిణ ధ్రువాన్ని అన్వేషిస్తోంది. కేవలం నిమిషానికి సెంటీమీటరు దూరం మాత్రం అది ప్రయాణిస్తూ జాబిల్లి ఫొటోలను విక్రమ్ ల్యాండర్‌కు చేరవేస్తోంది. విక్రమ్ ల్యాండర్ నుంచి భూకేంద్రాలకు సమాచారం అందుతోంది. చంద్రుని ఫొటోలను సగర్వంగా ఇస్రో దేశ ప్రజలకు తమ అధికార ప్రసార మాధ్యమాల ద్వారా తెలియజేస్తోంది. ఇదిలావుంటే ఇంకా అత్యంత కీలకమైన ప్రపంచంలో ఏ దేశమూ ఇప్పటికి తీయని ఫొటోలను అతి త్వరలోనే విడుదల చేస్తామని ఇస్రో ఛైర్మన్ ప్రకటించారు.

## పరిశోధనలు ఇంకా చాలా ఉన్నాయి - ఇస్రో ఛైర్మన్ సోమనాథ్



భారతదేశం ప్రపంచంలోని అగ్రదేశాలకు ఏమాత్రం తీసిపోని అంతరిక్ష పరిశోధన లు భవిష్యత్తులో ఇంకా చేస్తుందని ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. చంద్రయాన్-3 ఘన విజయం తర్వాత ఆయన భారతదేశానికి ఒక దిక్సూచి అయ్యారు. అసలు చంద్ర యాన్-3 ప్రయోగం చేసిన అనంతరం సోమనాథ్‌కు క్షణం విశ్రాంతి లేదు. అడుగడుగునా పరిశోధనలు, కక్ష్యలను అధిగమించడం వంటి కార్యక్రమాలలో బిజీ అయ్యారు. మరోవైపు సరికొత్త అన్వేషణలు చేపట్టారు. ఆగస్టు 23 సాఫ్ట్ ల్యాండింగ్ ఘఘన కార్యం తర్వాత సోమనాథ్ అపరిమిత ఆనందాన్ని అనుభవించారు. ఇదిలావుంటే సైన్స్‌కి, ఆధ్యాత్మికతకు రెండింటికీ ప్రాధాన్యత ఇస్తానని సోమనాథ్ ప్రకటించారు. చంద్రయాన్3 దిగిన ప్రదేశాన్ని శివశక్తి ప్రదేశంగా ప్రధానమంత్రి ప్రకటించిన విధానాన్ని ఆయన సమర్థించుకున్నారు. స్వచ్ఛమైన వేదాల నుంచే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పుట్టుకొచ్చిందని ఆయన అభిప్రాయం. విజయవంతం కాలేకపోయిన చంద్రయాన్-3 హార్డ్ ల్యాండింగ్ ప్రదేశానికి సైతం తిరంగా పాయింట్ అని పెట్టడం ఆహ్వానించదగ్గ పరిణామమని సోమనాథ్ పేర్కొన్నారు. చంద్రయాన్-3 ప్రయోగానికి ముందు జాబిల్లి దక్షిణ ధ్రువంపై సరికొత్త చరిత్ర లిఖించిన తర్వాత కూడా ఆయన కొన్ని ప్రముఖ దేవాలయాలను దర్శించుకున్నారు.

## సోమనాథ్ ఆధ్వర్యంలో 12 రాకెట్లు.. 100 ఉపగ్రహాలు

2022 జనవరి 14న అప్పటి ఇస్రో ఛైర్మన్ కె.శివన్ ద్వారా ఎస్.సోమనాథ్ ఇస్రో ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన ఆధ్వర్యంలో జరగని రాకెట్ ప్రయోగం లేదు. రెండేళ్లు పూర్తి కాకుండానే ఏకంగా 100 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టిన ఘనత ఆయనది. ఆదిత్య ఎల్1 ప్రయోగం తర్వాత ఈ సంఖ్య 101కి చేరుకుం టుంది. మూడు ఎల్‌విఎం3 బాహుబలి రాకెట్లు, ఒక జిఎస్‌ఎల్‌వి, ఆరు పిఎస్‌ఎల్‌విలు, రెండు ఎస్‌ఎస్‌ఎల్‌విలు సోమనాథ్ ఆధ్వర్యంలో శ్రీహరికోట నుంచి ప్రయోగించారు. వీటిలో స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో మొదటిది మాత్రమే విఫలం చెందింది. వీటికి తోడు స్కై రూట్ అనే ఒక ప్రైవేటు సంస్థ కూడా షార్ నుంచి రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిం ది. సోమనాథ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం మన భారీ





మహిళా శాస్త్రవేత్తలను అభినందిస్తున్న ప్రధాని మోడీ



చంద్రయాన్-3 ప్రయోగానికి ముందు శ్రీచెంగాళమ్మకు పూజలు చేస్తున్న ఇస్రో ఛైర్మన్ సోమనాథ్

ఉపగ్రహం జిశాట్ 24ను ఫ్రెంచి గయానా నుంచి విజయవంతంగా ప్రయోగించారు. ఇన్ని ప్రయోగాలను ఇంత తక్కువ కాలంలో జరిపించిన ఘనత సోమనాథ్‌ది. నాలుగేళ్ల పాటు ఇస్రోకి గుండెకాయ వంటి తిరువనంత పురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో డైరెక్టర్‌గా పనిచేసిన అను భవం సోమనాథ్‌కు ఉంది. రెండున్నరేళ్ల పాటు మహేంద్రగిరిలోని లిక్విడ్ ప్రొపె ల్లంట్ శాటిలైట్ సెంటర్‌లో డైరెక్టర్‌గా పనిచేశారు. 1985లో త్రివేండ్రంలోని విఎస్ఎస్‌సిలో ఇస్రో శాస్త్రవేత్తగా చేరిన ఆయన ప్రారంభంలో పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ అనుసంధానంలో ఒక ముఖ్యపాత్ర పోషించారు. అనంతరం జిఎస్ఎల్‌వి, జిఎస్ఎల్‌వి మార్క్3 వంటి భారీ రాకెట్ల నిర్మాణంలో చురుగ్గా వ్యవహరించారు. అంతకుముందు ఏరో స్పేస్ ఇంజనీరింగ్‌లోను ఆయన గోల్డ్ మెడల్ సాధించారు. పలు మెరిట్ అవార్డులు పొందారు. కేరళ నుంచి వచ్చిన జి.మాధవన్ నాయర్, కె.రాధాకృష్ణన్‌ల తర్వాత మూడవ వ్యక్తి సోమనాథ్. ప్రస్తుతం అనితరసాధ్యునిగా అంతరిక్షంలో అనంత విజయాలు సాధిస్తున్నారు. ఇటీవల చంద్రయాన్-3 ప్రయోగానికి ముందు చెంగాళమ్మ ఆలయానికి వచ్చిన సోమనాథ్ 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ చంద్రుని పై తాము ప్రయోగించిన మొదటి రెండు ప్రయోగాలు కూడా సూపర్‌హిట్ అయ్యా యని, చంద్రయాన్-3కి ఎన్నో విలువైన మార్పులు చేసిన కారణంగా ఇది కూడా విజయవంతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. అది సాధ్యం అయ్యింది.

## అంతరిక్ష పరిశోధనలో వీరముత్తువేల్ -చెల్లెలి పెళ్లి కన్నా చంద్రయాన్-3 మిన్న



ఆ శాస్త్రవేత్తకు సొంత చెల్లెలి పెళ్లి కన్నా చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగే ముఖ్యమైంది. చంద్రయాన్-3 ప్రయోగంలో ప్రాజెక్టు డైరెక్టర్‌గా వ్యవ హరించిన పి.వీరముత్తువేల్ తమిళనాడు లో ప్రస్తుతం అంతరిక్ష పరిశోధనకు హీరో అయిపోయాడు. సోదరి పెళ్లికి వెళితే మూడురోజుల పాటు సాఫ్ట్ ల్యాండింగ్ పర్యవేక్షణ కార్యక్రమం కొనసాగించలేనని ఆయన విధి నిర్వహణకే ప్రాధాన్యత ఇచ్చారు. డాక్టర్ వీరముత్తువేల్ తమిళనాడులోని విల్లుపురం ప్రాంతానికి చెందినవారు. ఇస్రోలో సీనియర్ శాస్త్రవేత్తగా పలు ర్యాంకులు సాధించారు. ప్రస్తుతం చంద్రయాన్-3కి కీలకమైన ప్రాజెక్టు డైరెక్టర్‌గా వ్యవహరించారు. విదేశాల లోనూ ఉద్యోగ అవకాశాలు వచ్చినప్పటికీ అంతరిక్ష పరిశోధనలపై ఉన్న ఆసక్తి కారణంగా ఇస్రోలోనే పనిచేస్తున్నారు. ఆయన పనితీరు, అంకితభావానికి ముచ్చటచెందిన ఇస్రో పెద్దలు కీలకమైన ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమించారు.

## కల్పన కల ఫలించిన వేళ



తెలుగు రాష్ట్రాల్లో ఎంతోమంది అంతరిక్ష పరిశోధకులు చంద్రయాన్-3 పరిశోధనలో కాళహస్తి కల్పన కల ఫలిం చింది. ఆమె అంతరిక్ష పరిశోధనలో ఒక మరచిపోలేని మహిళా శాస్త్రవేత్త. చిత్తూరు జిల్లా నగరి మండలం తడుకుపేట గ్రామానికి చెందిన కల్పనకు చిన్నప్పటి నుంచి ఇస్రోలో పనిచేయాలని కోరిక. కాళహస్తి కల్పన చెన్నైలోని మద్రాసు యూనివర్శిటీలో బిటెక్‌లో ఈసీఈ చదివారు. అప్పుడే 2000 సంవత్సరంలో ఇస్రోలో ఇంజనీర్‌గా ఎంపికయ్యారు. మొదట శ్రీహరికోటలో ఆమె శాస్త్రవేత్తగా చేరారు. అనంతరం అంచలంచెలుగా ఎదిగి ప్రస్తుతం చంద్రయాన్-3కి అసోసియేట్ ప్రాజెక్టు డైరెక్టర్ స్థాయికి చేరుకున్నారు. బెంగళూరులోని యుఆర్‌రావు శాటిలైట్ సెంటర్‌లో ఆమె చంద్రయాన్-3 ప్రాజెక్టు రూపకల్పనలో కీలక భూమిక వహించారు. ఆగస్టు 23న విక్రమ్ ల్యాండర్ చంద్రుని దక్షిణ ధ్రువంపై



బండ్ల మీద రాకెట్‌ను తరలిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు

సాఫ్ట్ ల్యాండింగ్ అయిన వెంటనే స్వగ్రామం తడుకుపేటతో పాటు ఆమె జన్మించిన శ్రీకాళహస్తిలోనూ పండుగ వాతావరణం నెలకొంది. తడుకుపేట పాఠశాలలో టీచర్లు, పిల్లలు జయహో నినాదాలను చేశారు. ఒక్క కల్పన మాత్రమే కాకుండా తెలుగు రాష్ట్రాలలో అనేకమంది శాస్త్రవేత్తలు ఇస్రోలో పనిచేస్తున్నారు. కేవలం ఈ ప్రాజెక్టులో మాత్రమే కాకుండా ఇస్రోలోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న తెలుగు శాస్త్రవేత్తలు అందరికీ చంద్రయాన్-3 ఎంతో గౌరవ మర్యాదలనిచ్చింది. పలు ఇస్రో కేంద్రాల నుంచి సొంత ప్రాంతాలకు వెళుతున్న శాస్త్రవేత్తలను హారతులతో స్వాగతిస్తున్నారు. ❑

# ఎన్నాళ్లీ హింస?



**భార్యాభర్తల** మధ్య గొడవలు జరిగితే, దెబ్బలు తగిలేది భార్యకే. డబ్బు కావాల్సి వస్తే, వరకట్నం కింద వేధిస్తే చాలు డబ్బు రాలిపడుతుంది. చివరికి మణిపూర్‌లో రెండు జాతుల మధ్య జరిగిన ఘర్షణలో లైంగిక దాడులకు గురైంది స్త్రీలే. ఇలా ఏ హింస, గొడలు జరిగినా నలిగిపోయేది, నష్టపోయేది, బాధించబడేది మహిళలే. నాటి ద్రౌపది నుండి నేటి మణిపూర్ మహిళలు దాకా రెండు వర్గాల మధ్య ఆదిపత్యపోరులో మహిళలు సమిధలుగా మారి దగ్ధమవుతున్నారు. మానవాళి సిగ్గుతో తలదించుకుని మనుషులుగా ఎందుకు పుట్టామా అని బాధపడే సంఘటనలు చాలా జరిగాయి. మణిపూర్‌లో మహిళల మీద అత్యాచారాలు, మూకుమ్మడి మానభంగాలు మరీ దారుణం. ఇద్దరు కుకీ జాతి స్త్రీలను వివస్త్రలను చేసి నడివీధుల్లో ఊరేగించిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారి దేశం భగ్గుమంది. వారిని అతిక్రూరంగా, నిర్భయంగా పట్టపగలు పదిమంది మధ్యలో మూకుమ్మడిగా లైంగిక దాడికి పాల్పడడం చూస్తుంటే మానవత్వం పూర్తిగా అంతరించి అటవిక నాగరికతలో జీవిస్తున్నామా అనిపిస్తోంది. మరో సంఘటనలో మైతేయి వర్గానికి చెందిన స్త్రీలు కుకీ జాతికి చెందిన 18ఏళ్ల అమాయిక బాలికను తమ వర్గం పురుషులకి అప్పగించి సామూహిక అత్యాచారానికి పురికొల్పడం ఎంత దారుణం. మణిపూర్ దమనకాండలో వెలుగు చూసిన కథనాల ప్రకారం మహిళలపై జరిగిన లైంగిక అత్యాచారాలు 10పైనే ఉంటాయి. ఇంకా వెలుగులోకి రాని సంఘటనలు ఎన్నో. కుకీ జాతి ప్రజలు మైతేయి వర్గానికి చెందిన ప్రజల మీద తిరుగుబాటు చర్యలకి పాల్పడినప్పుడుకూడా చాలా అరాచకాలు జరిగాయి. ప్రతీకారేచ్ఛతో



గృహదహనాలు, అత్యాచారాలు షరా మామూలే. మానవత్వం నశించిన పాశవికి చర్యలో మహిళలు కూడా పాలు పంచుకోవడం చాలా నీచమైనది. మనుషులుగా పుట్టిన మనం సిగ్గుతో తలదించుకోవలసిన దుర్ఘటన. ఇరుదేశాల మధ్య, ఇరు రాజ్యాల మధ్య, ఇరు వర్గాల మధ్య ఇరు మతాలమధ్య ఏ రెండు వర్గాల మధ్య పోరాటం లో అయినా మహిళలు సమిధలుగా మారి collateral Damage నాశనం అవుతున్నారు. మహిళల్ని లైంగికంగా వేధించి, హింసించి, అవమానించి గెలుపు సాధించామని విర్రవీగడం ఏ నీచ సంస్కృతి నేర్పింది? మణిపూర్ మహిళలు పలురకాల హింసలకు గురవుతున్నారు.



వెలుగు చూడని లైంగిక దమన కాండలో నాశనం అయిన స్త్రీలు చేసిన పాపం ఏమిటి? కేవలం అణగారిన వర్గాలలో పుట్టడమేనా. శీలం, మానం అభిమానం కూలీనకాలస్త్రీలకేనా మిగతావారు స్త్రీలు కారా? ఇదెక్కడి అటవిక న్యాయం? మనిషి తప్పు చేస్తే పశువులా **(మిగతా 19వ పేజీలో)**



# జాబిల్లిపై భారత్ పతాకం

కందిరీగలా విను వీధిలో ఓ గాలిపటం తిరుగుతూ ఉంటే
పతంగ్‌ల పండుగ వచ్చిందని/ మా బుడ్డోడు ఒకే సంబరం
అది మన భారతీయ శాస్త్రీయ పతంగమని
అది జాబిల్లిపై ఎగురుతున్నదని
అమ్మ చెబితే ముక్కున వేలేసుకున్నాడు
అంత పొడవాటి దారం ఎలా అమ్మ అన్నాడు
అది దారం లేని గాలి పటం
దాని ఆధారం సౌర విద్యుత్తుతో నడిచే యంత్రం అంటే ఇంకా
ఆశ్చర్యపడ్డాడు
అది జాబిల్లిని చేరుకునే రోజిది
మనం బుల్లితెరలో చూస్తాం ఎంచక్కా
అంటే ఇంకా సంబరపడ్డాడు
అమ్మా.. అమ్మా మన శాస్త్రవేత్తలనూ అభినందిస్తూ ఒక గాలిపటం
ఎగురవేస్తానే అంటూ.. / తనే గాలిపటం చేసుకొని
గాలిలో ఎగురవేశాడు
మరి.. మనమూ కనీసం మన అభినందనల అక్షరాల గాలిపటం
ఎగురవేద్దామా!

**- డా॥ వి.డి.రాజగోపాల్**



## బోసి నవ్వులతో ప్రపంచం

తరాలుగా
చందమామ రావే... జాబిల్లి రావే అని
పసివాడి నోట పలికిన జాబిలి ప్రేమ
చంద్రయాన్ యాత్రతో దగ్గరై
వెన్నెల వాకిట అడుగెట్టి/ చందమామను ముద్దాడిన
మన భారతమాతను చూసి
బోసి నవ్వులతో ప్రపంచం కేరింతలు కొట్టింది.

**- చందలూరి నారాయణరావు**

# ఈవారం కవిత్వం



## అక్షరమాల

నేనొక ప్రేమ పిపాసిని ఆ జాబిలొక
అందని చిరునవ్వుల దివ్వే నా గుండెలపై ఆ రాణి
అనునిత్యం సవారి చేస్తున్నట్లనిపిస్తుంది
ఎదపై సొదలు చేస్తూ/ రంగు రంగుల ప్రపంచంలోకి
మరో కొత్త బంగారు లోకంలోకి/ లాక్కెళ్లుతున్నట్లనిపిస్తుంది
ఎన్ని జన్మల బంధమో ఇది / జన్మ జన్మల అనుబంధం
ఆ చెలి ఎక్కడో ఉండి/ ఇక్కడ ఈ కవి హృదిని నిలువునా
దోచుకుంది హృదిలో దాచుకుంది
మనసున మల్లెలు పూయించే
కలువపూల చెలియా
అందుకో
అర్పిస్తున్నాను
అక్షరమాలలు/ ఓ...
చెలియా
ఓ.. నా హృదయానిత జనితా/ నా కవితకు నాంది పలికిన చెలియా
ఓ.. నా ప్రియమణి
(రాజస్థాన్‌లోని లంబాడి వనిత అందంగా గోచరించినప్పుడు రాసిన కవిత)

**- కొరుప్రోలు వారనాథ్**

## 'సినీగీతావరణం' సినీ పాటల సాహిత్యం



తెలుగు చలన చిత్రరంగానికి సంబంధించి టాకీ చిత్రాల ఆరంభం నుంచి, శతాధిక పాటల రచయితల జీవిత విశేషాలను 'సినీగీతావరణం' విశ్లేషణాత్మకంగా వివరించే సద్గ్రంథం. ఈ వ్యాససంకలనం సంపాదకులుగా నల్లభాపురంజనార్దన, కె.ఆనందాచారి, డా॥తిరునగరి శరత్‌చంద్ర, సంపాదకవర్గంగా స్ఫూర్తి, రాంపల్లి రమేష్, తంగిరాల చక్రవర్తి, సలీమ, అనంతోజు మోహన్‌కృష్ణ రచయితలు, సాహితీవేత్తలు కావడంతో, అభినందనీయమైన సత్కృషి అందించడం లో 'తెలంగాణ సాహితి', కృతకృత్యత సాధించింది. వ్యాసరచయితలు, విషయ సేకరణను పరిశోధన ఆసక్తితో ఎంతో శ్రద్ధాసక్తులతో నిర్వర్తించారు. జానపద, భక్త, ప్రజాకవుల సాహిత్యం పొందిన ప్రాధాన్యం, సినీపాటలు ఎంత ప్రాచుర్యం, సన్నిహితంగా దైనందిన జీవనంతో సుపరిచితమైనా అంతగా సాహితీ బాంధవ్య గుర్తింపు, పొందటం లేదనేది నిర్వివాదాంశం. సినిమా పాటల రచయితలలో తెలుగు సాహితీ వికాసానికి ఎనలేని సేవలందించిన లబ్ధ ప్రతిష్ఠులు ఎందరో ఉన్నారు. తెలుగు పాటకు జవసత్వాలందించి ప్రజల నాల్కలపై నాట్యమాడే వ్యవహారిక భాషా సుసంపన్నతకు వారు మార్గదర్శకులయ్యారు. అదేవిధంగా సినీ పాటల రచయితలుగా ప్రతిభావంతంగా పాటలు రాసినా, వెలుగులోకి రానివారు ఎందరో వున్నారు. 'సినీగీతావరణం' తెలుగు సీపాటల రచయితల, ప్రతిభా విశేషాలను ఆసక్తికరంగా, విజ్ఞానాత్మకంగా చదువురులకు వివరిస్తోంది. **(సినీగీతావరణం, రచన: ప్రధాన సంపాదకులు: కె.ఆనందాచారి, వెల: రూ 650, ప్రతులకు: తెలంగాణ సాహితీ, నవతెలంగాణ పబ్లికేషన్ హౌస్)** **- యర్రమిల్లి**

## 'క్రియ ఒక జీవన లయ'



కిల్లాడ సత్యనారాయణ ఐపిఎస్ ఈ కవితా సంపుటి అంకితం చేసారు కవి గోపి. 'కలాన్ని నిద్రపోని వ్వని' కవి. అక్షర జీవగీతాల్లోంచి ఎనభైదాకా మానవ జీవనసారాన్ని కన్నీటితో ఆవిష్కరించిన అద్భుత కవిత్వం ఈ పుస్తకం నిండా ఉంది. రేపటి కవులకు 'గొప్ప' సిలబస్ బుక్‌లా ప్రతి కవిత ఉన్నాయి. జెండా పొగరు గురించి రాస్తారు కొందరు. ఆ జెండా తలదించుకొనే ఘటనలు దేశం అంతా జరుగుతున్నవేళ 'జెండా' కవితలో ఒక చోట కవి ఇలా అంటాడు (పేజీ:15). 'ఎందుకో ఏమో ఇవాళ/ జెండా ఎగురువేళ ఆయాస పడుతున్నది. చుట్టూ గాలిలో/ ఆక్సిజన్ కరువైనట్టున్నది/ ఎప్పుడూ ఎవ్వరికీ/ తలవంచని జెండా తల తేలేస్తున్నది' అనడంలో నర్మగర్భితంగా కవి ఆవేదన, ఆలోచన తెలుస్తుంది. మట్టి ఒక్కటే/ ఏరూపంలో దర్శించినా/ అనుభూతమయ్యే/ బాహ్యాంతర్గత చిరంతన తాత్విక రేఖ, చంద్రుడైనా/ అంగారకు డైనా/ కష్టపడి వెళ్లి యాచిస్తే/ కానుకగా ఇచ్చేది దోసెడు మట్టివే, వ్యక్తిత్వ వికాసాన్ని ఒక తాత్వి కునిలా కవిత్వంలో చెప్పి 'సాంత్వన' ఇస్తారు కవి (పేజీ.120) 'కొన్ని వున్నాయంటేనే కొన్ని లేవని అర్థం/ రహదారులున్నాయి అంటే, ప్రయాణం జ్ఞాపకాలుగా మారుతుందని అర్థం/ చూపునుబట్టే రేపు అంటారు. సాంత్వన కవితలో కవి. స్మృతి నా జీవనగతి తాళం చెలికాల పేటిక గాలిపాట లాంటి కవితలు అద్భుతంగా ఉన్నాయి. ఆలోచింపచేస్తాయి. **(క్రియ ఒక జీవన లయ, రచన: డా॥ ఎన్.గోపి, వెల: రూ 200, ప్రతులకు: ఇ.నం. 13/1బి, శ్రీనివాసపురం, రామాంతపూర్, హైదరాబాద్)** **- తంగిరాల చక్రవర్తి**

**పుస్తక సమీక్ష**

## అనుభవం వెదజల్లిన కవిత్వకాంతులు



చాలాకాలం తర్వాత కవిత్వాన్ని కవిత్వంలా సృజించిన గజ్జెల రామకృష్ణ కావ్యం 'దీపముండగానే' చదవడం ఓ గొప్ప అనుభవం. ఆయన కవన విన్యాసం (శక్తి) ఆస్వాదించిన తర్వాత యిది తొలి ప్రయత్నంలా లోచదు. చేనేత వృత్తిలో రాణిస్తున్న రామకృష్ణ చదివింది పదవతరగతి. కవిత్వం రాయడానికి పెద్ద చదువులేం అఖర్లేదు..సమాజాన్ని, జీవితాన్ని లోతుగా చదవగలిగితే చాలు. 'పోగులో పుట్టి..పోగులో పెరిగి/ పోగు, పోగు అల్లుకుపోయే మెతుకుకళ/ శూన్యంలోకి చూస్తున్నది' యిదీ మగ్గం 'పాడుతున్న చేదురాగం'. 'గిట్టుబాటు గాదని/ కాలు దుల్పినా కన్నేర్రజేసినా/ కంజం తన్నేసిన పాపం కడుపు మడ్డట్లు/ పెట్టుబడి పెత్తనం ముందు 'తల వొంచకు తిరుగుతున్న కూలీబ్రతుకు' యిదీ 'ఆకలిరాగం' నేతన్నల వేదనాత్మక బ్రతుకు వాస్తవికతను తన కైతల్లో ఊరించి పాఠకుల హృదయాలను చెమ్మరిల్లజేస్తాడు. చాలా కవితలు నేతన్నల వేతల్నే వినిపిస్తాయి. రామకృష్ణది అనుభవ కవిత్వం. అనుభూతిమయం కట్లపాడు, పూలరథం, సాలెగూడు, నల్లకుక్క, చిలుకరెక్క, పంజరం..యిలా వస్తువు ఏదయినా రామకృష్ణ కలంలో కవిత్వమై ఒదుకుతుంది. 'పూలకొమ్మ ఊపినట్లు/ నీటిపువ్వులు రాలుతున్నాయి' వంటి అద్భుత పంక్తుని కవితల్నిండా ఆస్వాదించవచ్చు. **(దీపముండగానే, రచన: గజ్జెల రామకృష్ణ, వెల: రూ 100, ప్రతులకు: ఇ.నం.13-40, ప్రకాశ్‌నగర్ కాలనీ, భూదాన్ పోచంపల్లి, యాదాద్రి భువనగిరి జిల్లా)** **- రమణ వెలమకన్ని**

## గ్రామ ప్రజల నీతిని తెలిపే కథలు



కవిగా కొన్నాళ్ల నుండి అక్షరసేద్యం చేస్తున్న బైతి దుర్గయ్య అప్పుడప్పుడు కథలు కూడా రాస్తారు. ఆ కథలు అలాంటివి, ఇలాంటివి కాదు, 'ఆణిముత్యాలు' అని ప్రముఖ సాహితీవేత్త విరించి పొగడేంత మంచిగా ఉంటాయి. కథ, కథనం రెండూ అలపట, దాపటి ఎద్దుల్లా ఒక దాన్ని ఒకటి సపోర్ట్ చేస్తూ హృద్యంగా సాగుతాయి. పల్లెటూరి నేపధ్యం లేని పాఠకులు అలపట, దాపటకు బేధం తెలుసుకుంటారు. గొర్రెల పెంపకంలో 'నుచ్చకొట్టటం', 'గుడుకలు' లాంటి గ్రామీణ పదాలకు అర్థం తెలుసుకుంటారు (పే 26,27). అంతేకాదు, పల్లెవాసుల కష్టసుఖాల్లో మమేకం అవుతారు. పెంకుటిళ్లు, భూమిని నమ్ముకున్న బక్కచిక్కిన రైతుల కన్నీళ్లు కనిపిస్తాయి. పొలాల్ని,సేద్యాన్ని నమ్ముకున్న బాగయ్య లాంటి రైతులు (అభాగ్యుని ఊయల) పొలంగట్టుమీదున్న తుమ్మ చెట్టుకు ఎందుకు ఊయలై ఊగుతారో తెలుసుకుంటారు. దుర్గమ్‌బైతి మాత్రమే రాయగలిగిన కథలివి. కాలం వెంట నడుస్తూ తాను కూడా కరోనా కష్టకాలంలోంచి కథలు సృష్టించగలనని, 'ఎంతమంచి వారండీ', 'వలసఖైదీ' కథల ద్వారా నిరూపించుకున్నారు. క్లుప్తత సంక్షిప్తతత ఈ కథలకు రచయిత ధరింపచేసిన ఆభరణాలు, గ్రామీణ సంస్కృతి వీరి కథల్లో ప్రతిబింబిస్తాయి. అందుకే ఇవి తప్పక చదవదగిన మంచికథలు. **(దాపటెద్దు, కథలు, రచన: దుర్గమ్‌బైతి, వెల: 125, ప్రతులకు: బైతి తార, గ్రా॥రామునిపట్ల, మం॥చిన్నకోడూరు, సిద్ధిపేట జిల్లా)** **- కూర చిదంబరం**



# గురుశిష్యుల బంధం

**వాసిలి సురేష్**

**ప్రతి** వ్యక్తి జీవితం మీద ఉపాధ్యాయుని ప్రభావం అధికంగా ఉంటుంది. మనుషుల జీవితాలను మార్పు చెందించేది, జీవితాన్ని ఉన్నత స్థాయిలో నిలబెట్టడానికి ఉపయోగపడేది చదువు మాత్రమే. చదువు ద్వారా విజ్ఞానం పొందిన విద్యార్థులు విద్య ఉపాధి అవకాశాలను ఉపయోగించుకుని తమ జీవితాలను అత్యున్నతంగా మార్చుకుంటారు. నేడు అటువంటి విద్యను బాలలకు అందించేది ఉపాధ్యాయులు. విద్యను అందించడం ద్వారా ఉపాధ్యాయులు వ్యక్తుల జీవితాలను మారుస్తూ, తద్వారా సమాజ అభివృద్ధికి దోహదపడుతున్నారు. చిన్న వయసు నుంచి పిల్లలు నేర్చుకోవడం, అభ్యసించడం అనే ప్రక్రియలు ప్రధానంగా ఉపాధ్యాయుల నుంచే జరుగుతుంది. నాగరికత మొదలైనప్పటి నుంచి ఉన్న ఉపాధ్యాయ వ్యవస్థ ఎప్పటికీ నిలిచే ఉంటుంది. దానికి ప్రత్యామ్నాయం లేదు. పాఠశాల వ్యవస్థలో ఉపాధ్యాయుడు అతికీలకమైన వ్యక్తి. సమాజంలో కూడా ఉపాధ్యాయుడిదే ఉన్నతస్థానం. ఉపాధ్యాయులు గురువుగా, తత్వవేత్తగా, ఆచార్యుడిగా, మార్గదర్శకుడిగా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతారు. అందుకే ఉపాధ్యాయులు విద్యాపరంగా, మూర్తిమత్వపరంగా సమర్థులై ఉండాలి. ఎప్పటికప్పుడు తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మొదలైన వాటిసాయంతో ఉపాధ్యాయులు తమ సాధికారతను పెంచుకోవాలి. మారుతున్న కాలాన్ని బట్టి, అవసరాల మేరకు విద్యారంగంలో మార్పులు రావడం సహజంగా జరుగుతాయి. కాబట్టి ఉపాధ్యాయులు కూడా కాలంతోపాటు విద్యలో వస్తున్న మార్పులు కొత్త అంశాలు ఎప్పటికప్పుడు తెల్సుకోవడం జరుగుతూ ఉండాలి. ఉపాధ్యాయుడు అంటే బోధించే వ్యక్తి కాదు, కానీ విద్యార్థికి అప్పటికే తెలిసిన వాటిని కనుగొనడానికి, ఉత్తమమైనదాన్ని అందించడానికి విద్యార్థులను ప్రేరేపించే వ్యక్తి.

ఉపాధ్యాయులను పిల్లలకు రెండవ తల్లిదండ్రులుగా భావిస్తారు. ఉపాధ్యాయులు పిల్లలను బాహ్య ప్రపంచంలో వివేకంతో వాస్తవికతను ఎదుర్కొనేలా చేస్తాడు. పిల్లల అమాయకత్వం దశ నుండి అనుభవ దశకు వెళ్లడానికి పిల్లలను సిద్ధం చేయడంలో ఉపాధ్యాయుని పాత్ర కీలకమైనది. ఏదేమైనా, ప్రతిదీ చాలావేగంగా మారుతున్నప్పుడు అభివృద్ధి చెందుతున్నకాలంతో, ఒక ఉపాధ్యాయుడు మొండిగా ఉండలేడు కానీ బహుశా మార్పుకు లోబడి ఉండాలి.

## కాలంతోపాటు బోధనలో వస్తున్న మార్పులు

పూర్వకాలంలో ఉపాధ్యాయ విద్యార్థి సంబంధం ఒక విధమైన భయంపై ఆధారపడి ఉండేది. ఎందుకంటే ఆ విషయానికి మచ్చిక చేసుకోవడం బోధనలో ముఖ్యమైన అంశం. నిస్సందేహంగా, ఒక ఉపాధ్యాయులు అదే స్థాయిలో కష్టపడి పని చేసేవారు. ఉపాధ్యాయులు తన విద్యార్థులతో అంకితభావంతో ఉన్నారు. అయితే వాస్తవం ఏమిటంటే విద్యార్థులు వారితో స్నేహపూర్వక సంబంధాన్ని పంచుకోలేకపోయారు. విద్యార్థులతో కఠినంగా ఉండటం బోధనలో ఒక ప్రముఖ అంశంగా పరిగణించబడింది. ఆధునికత రాకతో, ఉపాధ్యాయుని పాత్ర, బోధనా విధానాలు మారాయి. ప్రస్తుత కాలంలో ఒక ఉపాధ్యాయుడు ఒక విద్యార్థిని విషయాలను అర్థం చేసుకోవడానికి అతనితో స్నేహం చేయాలి. ఎందుకంటే ఆధునికత ఒంటరిగా రాలేదు కానీ దానితోపాటు చాలా సానుకూల, ప్రతికూల విషయాలను తీసుకువచ్చింది. పూర్వకాలంలోని విద్యార్థులు ప్రస్తుతకాలంలోని విద్యార్థుల కంటే సంతోషంగా ఉన్నారు. ఎందుకంటే ప్రస్తుత కాలంలో విద్యార్థులు లేదా పిల్లలు వారు ఉద్దేశించబడకముందే విషయాలను బహిర్గతం చేస్తారు. ఈ రోజుల్లో పిల్లలు చాలా సెన్సిటివ్‌గా మారారు. కాబట్టి నేడు ఉపాధ్యాయుని పాత్ర కష్టంగా మారింది. ఎందుకంటే ఉపాధ్యాయులు అలాంటి పరిస్థితులను ఎదర్కొవలసి ఉంటుంది. తమ విద్యార్థులను ప్రేమగా, శ్రద్ధగా చూసుకోవాలి. కరోనా మహమ్మారి సమయంలో విద్యా వ్యవస్థకు తక్కువ నష్టాన్ని కలిగించలేదు. స్థిరత్వాన్ని కొనసాగించడం ఉపాధ్యాయులకు అతిపెద్ద సవాలుగా మారింది. వ్యక్తిగతంగా బోధన నుండి వర్చువల్‌కు ఆకస్మిక మార్పు జరిగింది. విద్యార్థులకు కేవలం పరధ్యాన్నంగా పరిగణించబడే గాడ్జెట్‌లు వర్చువల్ బోధనకు ఏకైక మూలంగా మారాయి. కరోనా మహమ్మారికి ముందు వారికి అంతగా అవగాహన లేని సాంకేతికతకు విద్యార్థులను దగ్గర చేసింది. దీంతో విద్యార్థులు వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, గేమ్‌లు మరెన్నో చిన్న వయస్సులో ఉన్న వివిధ రకాల ఇంటర్నెట్ యాక్టివిటీస్ నందు మునిగిపోయారు. అందువలన విద్యార్థులు తమ ఏకాగ్రత శక్తిని కోల్పోయారు. వివిధ ప్రాపంచిక కార్యకలాపాలలో సులభంగా నిమగ్నమై ఉన్నారు.

దాదాపు మూడు సంవత్సరాల వ్యవధి తర్వాత, బోధన ప్రక్రియ మళ్లీ వ్యక్తిగతంగా మారడంతో సాధారణ స్థితికి వచ్చింది. కానీ ఉపాధ్యాయులు బాధల్లో ఉన్న పిల్లలను బయటకు వచ్చేలా చేయడంలో వారు తీవ్రంగా కృషి చేయవలసి వచ్చింది. ఉపాధ్యాయులు వాటిని క్లాస్‌రూమ్ బోధనతో సర్దుబాటు చేయాల్సి వచ్చింది. ఉపాధ్యాయుడు తన బోధనను ఎప్పటికప్పుడు అంచనా వేసుకోవాలి. ఎప్పటికప్పుడు తన బోధనను మెరుగుపరచుకోవాలి. అవసరమైతే తన తరగతి బోధన పుస్తకాల పరిధి దాటాలి. బోధనలో సరైన సాధనాలను ఉపయో గిస్తూ పిల్లలో ఆసక్తిని పెంచేలా ఉండాలి. తరగతి గదిలో ఉన్న అందరి విద్యార్థుల మానసిక స్థితిగతులు, తెలివితేటలు వారి ఇంటి వాతావరణము ఒకే విధంగా ఉండవు అన్న విషయాన్ని గుర్తుంచుకుని ఉపాధ్యాయుడు బోధనను మార్చుకుంటూ ఉండాలి.

**ఉపాధ్యాయునికి ప్రత్యామ్నాయం లేదు**

నేడు విద్యలో టెక్నాలజీ వినియోగం వేగంగా పెరుగుతున్నది. వర్చువల్ క్లాస్‌రూం విధానం ఉపాధ్యాయులకు ప్రత్యామ్నయంగా మారుతుందని కొవిడ్ సమయంలో అందరూ ఉపయోగించారు. అనేక రకాల ఆన్‌లైన్ ఎడ్యుకేషనల్ సంస్థలు పుట్టు కొచ్చాయి. కానీ వాటి వినియోగం తర్వాత తెలిసిందేమిటంటే టెక్నాలజీ ఉపాధ్యాయుడిగా సహాయకారిగా ఉపయోగపడుతుంది. కానీ ఉపాధ్యాయునికి ప్రత్యామ్నాయం కాదు. కరోనా వలన ప్రపంచవ్యాప్తంగా ఉపయోగించిన ఆన్‌లైన్ టీచింగ్ విధానం వల్ల విద్యార్థులలో ప్రవర్తనాపరమైన సమస్యలు ఎదురయ్యాయి. దీంతో తల్లిదండ్రులు ఆన్‌లైన్ విధానం కంటే ఉపాధ్యాయుల బోధనే మంచిదన తెలుసు కున్నారు. అనేక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన స్మార్ట్‌క్లాస్ కూడా ఉపాధ్యాయుడు ఉపయోగించిన చోటే విజయవంతంగా కొనసాగుతున్నాయి.

**విలువలు పెంపొందించడంలో ఉపాధ్యాయుని పాత్ర**

విలువలతో కూడిన విద్యను అందించడం ఉపాధ్యాయులు బాధ్యతగా స్వీకరించాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో విలువలకు స్థానం లేకుంటే విపరీత పరిణామాలకు దారి తీస్తుంది. భావిపౌరుల ప్రవర్తన వారిలో ఉన్న విలువలను బట్టే ప్రతిబిం బిస్తుంది. నీతి నిజాయితీలు, విచక్షణ, సామాజిక సేవాదృక్పథం, జాతీయ సమైక్యత పట్ల గౌరవం, సామాజిక న్యాయం పట్ల అవగాహన, రాజ్యాంగం పట్ల గౌరవం ఇవన్నీ కూడా విలువల నుంచి వచ్చేవే. దాదాపు ఇరవై ఏళ్లపాటు విద్యార్థులు తమ విద్యను అభ్యసించడంలో నిమగ్నమవుతారు. అందులోనూ అధిక సమయం తరగతి గదిలోనే గడుస్తుంది.



కాబట్టి ఉపాధ్యాయులు విద్యార్థుల్లో విలువలు కలిగిన వారిగా మార్చడానికి ఎక్కువ బాధ్యత తీసుకోవాలి. విలువలు మానసిక ఆరోగ్యాన్ని కాపాడతాయి. అన్నింటికీ మించినది క్రమశిక్షణ. అది విద్యార్థి జీవితం నుంచి మొదలు కావాలి. ప్రభుత్వరంగంలో పని చేస్తున్న ఉపాధ్యా యులు విద్యను సంస్కరించడంలోను, సామాజిక మార్పులో తగిన కృషి చేయా ల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాలల విద్యాను భవంతో, తమ వంతు కర్తవ్యాన్ని నిర్వ హిస్తూ, ఉపాధ్యాయులు ప్రజాపక్షం వహించాలి. విద్యార్థులపట్ల ఉపాధ్యా యులు ప్రేమ, స్నేహ స్వభావంతో ఉండాలి. ఉపాధ్యాయులను చూసి భయ పడే విధంగా ఉండరాదు. విద్యార్థులు ఉపాధ్యాయుల దగ్గరికి చేరేవిధంగా చూడాలి. ఉపాధ్యాయులు కేవలం పాఠాలు చెప్పడంతోపాటు పిల్లలను అర్థం చేసుకొని వారితో కలిసి జీవించగలగాలి. ఉపాధ్యాయులు కేవలం పుస్తకాలలోని పాఠ్యాంశాలను మాత్రమే బోధించి, సామాజిక సమస్యలను, వాస్తవాలను, అనుభవాలను చెప్పకపోవడం వల్ల పరిస్థి తులను యథాతథంగా కొనసాగించడానికే ఉపయోగపడతాయి కానీ వారి జీవితాలను మెరుగుపరిచే వ్యవస్థలను, సమాజాన్ని తీర్చిదిద్దడానికి ఉపయోగపడదు. రాబోవు కాలం బాగుపడాలంటే ఇప్పటి తరానికి నీతి, నిజాయితీలను, మానవత్వ విలువ లను నేర్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయు లదే. విద్యార్థులకు చిన్నప్పటి నుంచి అన్యాయాలను, అక్రమాలను ధైర్యంగా ఎదిరించడం, పోరాడటం అలవాటు చేయాలి. సమస్యల పరిష్కారమార్గాలను తెలియజేయాలి. నేటి ప్రపంచ మనుగడ తెలియజేయాలి. అంతేకాక మెరుగైన సమాజం కోసం ఏమి చేయాలో కూడా తెలపాలి. సమాజాన్ని విశ్లేషించి, సామాజి క మార్పుకు ప్రయత్నించాలి. ఉపాధ్యాయులు విద్యార్థుల కుటుంబ నేపథ్యాన్ని అధ్యయనం చేయాలి. తదనుగు ణంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు సరైన మార్గదర్శనం చేయాలి. చదువుల పేరుతో విద్యార్థులను తరగతి గదులకు పరిమితం చేయ కుండా మానసిక వికాసానికి దోహదం చేసి చర్యలు తీసుకోవాలి. దేశభక్తితో మేధోపరమైన శిక్షణ నివ్వడం మాత్రమే సరిపోదు. సమాజంలో పాతుకుపోయిన మూఢనమ్మకాలను పాటించకుండా విద్యార్థి దశలో ఉన్నప్పుడు ఉపాధ్యాయులు వారికి సరైన మార్గదర్శనం చేయాలి. ఉపాధ్యాయులు వ్యక్తిత్వం విద్యార్థుల జీవితాలలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. కాబట్టి ఉపాధ్యాయులు, విద్యాపర్యవేక్షణా బాధ్యతలు కలిగిన వారి వ్యక్తిత్వం విద్యార్థులపై ప్రభావం అధికంగా ఉంటుంది. ఉపాధ్యాయులు తమ బోధనా ప్రతిభను పెంచుకోవాలి. విద్యార్థులకు స్వేచ్ఛావాతావరణం కల్గించాలి. స్వేచ్ఛ కలిగిన పిల్లలు మాత్రమే నవ సమాజాన్ని సృష్టించగలరు. తమ సొంత మానసిక వికాసానికి దోహదం చేసే చర్యలు తీసు కోవాలి. దేశభక్తితో మేధోపరమైన శిక్షణ నివ్వడం మాత్రమే సరిపోదు. సవజంలో పాతుకుపోయిన మూఢ నమ్మకాలను పాటించకుండా విద్యార్థి దశలో ఉన్నప్పుడు ఉపాధ్యాయులు వారికి సరైన మార్గద ర్శనం చేయాలి. ఉపాధ్యాయుల వ్యక్తిత్వం విద్యార్థుల జీవితాలలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. విద్యార్థులకు స్వేచ్ఛా వాతావరణం కలిగించాలి. స్వేచ్ఛ కలిగిన పిల్లలు మాత్రమే నవ సమాజాన్ని సృష్టించగలరు. తమ సొంత నిర్ణయాలతో పురోగతి సాధించగలరు. నేటి ఉపాధ్యా యులు పూర్తి స్థాయిలో తమ ప్రతిభ, పరిజ్ఞానాలను విద్యార్థులకు అందించలేకపోతున్నారు.

**(మిగతా 24వ పేజీలో)**

**కథ**

# నష్టంలేని వ్యాపారం

సిరిపురం గ్రామంలో రామయ్య, సోమయ్య అనే రైతులు ఇరుగుపొరుగున నివశిస్తుండేవారు. వారు ఇరువురు చాలా స్నేహంగా ఉండేవారు. వాళ్ల ఇరువురు ప్రతి ఆదివారం పొరుగురిలో జరిగే సంతలో తమ పొలంలో పండిన పలురకాల కూరగాయలు అమ్ముతూ ఉండేవారు.



ఒకవారం ఎప్పటిలా రామయ్య, సోమయ్య వేకువనే కూరగాయల మూటలు బండిపై వేసుకుని సంతచేరి, ఇరువురు పక్కపక్కనే కూర్చుని తాము తెచ్చిన కూరగాయలు పెట్టుకుని అమ్మసాగారు.

సాయంత్రం సూర్యాస్తమయం కాబోయే సమయానికి సోమయ్య కూరగాయలు అన్ని అమ్ముడుపోయాయి. రామయ్య వద్ద కొన్ని బీరకాయలు మిగిలిపోయాయి.

ఇంతలో చేతి సంచితో రామయ్య వద్దకు వచ్చిన ఓ వ్యక్తి 'ఈ బీరకాయలు కిలో వెల ఎంత? మొత్తం కలిపి ఎన్ని కిలోలు ఉంటాయి' అన్నాడు. 'అయ్యా కిలో ముప్పైరూపాయలు. మొత్తం ఆరుకిలోలు ఉంటాయి' అన్నాడు. రామయ్య 'ఏమిటయ్య ప్రతివారం నీవద్దే కొంటూ ఉంటాను. మొత్తం నూటయాభై రూపాయలు ఇస్తాను' అన్నాడు. 'సరే పొద్దుపోతుంది. నేనూ వెళ్లాలికదా' అన్న రామయ్య తన ముందు ఉన్న బీరకాయలు మొత్తం అతని చేతిసంచిలో వేసి డబ్బులు తీసుకున్నాడు.

'రామయ్య ఎదుటివారి అవసరాన్ని ఆసరా చేసుకుని తక్కువ ధరకు కొనుగోలు చేయాలని అందరూ చూస్తారు' అన్నాడు సోమయ్య.

'అలా అందరూ చేయరు. ఐనా నాకు ఎటువంటి నష్టం లేదు. ఆ బీరకాయలు ఉదయం నుండి ప్రజలు అందరూ ఏరివేసినవే. బాగా ఉన్నవి ఐదు కిలోలు మాత్రము ఉంటాయి. అతను నాకు చెల్లించింది కూడా ఐదుకిలోల ధర మాత్రమే. కనుక పిండికొద్ది రొట్టే అంటే ఇదే. అతనికి, నాకు ఎటువంటి నష్టం లేదు. నేను అతనితో చేసింది నష్టంలేని వ్యాపారం' అన్నాడు రామయ్య.

**- డా॥బెల్లంకొండ నాగేశ్వరరావు**

**చుక్కలు కలపండి**



**రంగులు వేయండి**







## బాలగేయం

### చదువు



చదువు మన కోసం
చదువు మన నేస్తం
చదువు మన దీపం
చదువు మన లక్ష్యం
చదువు మన గమ్యం
చదువు మన ప్రపంచం
చదువు మన ఆశాకిరణం
చదువు మన సంస్కారం
చదువు మనకు ప్రాణం
చదువే మన
జీవితాశయం
చదువుకు మన జీవితం
అంకితం.

**- కనుమ ఎల్లారెడ్డి**



## హలో ఫ్రెండ్...



**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కె.హారిణి,** హైదరాబాద్

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. కొండలు, మంచుకొండలు ఒకటేనా? వీటిలో ఏమైనా తేడాలున్నాయా?**

**జవాబు: హరిణి!** కొండల మీద బాగా మంచు కురిసి దట్టంగా ఏర్పడితే ఆ కొండలను మంచుకొండలని అంటారు. మంచుకొండల మీద చాలా మందంగా మంచు ఏర్పడినా కొంత కాలానికి కరిగిపోయి మామూలు కొండలుగానే మిగిలిపోతాయి. సముద్రాలలో ఏర్పడే మంచుకొండలు కూడా ఉంటాయి. వీటిని 'ఐస్‌బర్గ్'లని అంటారు. సముద్రాలలోని నీరు సాధారణంగా వేడిగా (నునువెచ్చగా నైనా) ఉంటాయిగానీ కొన్ని చోట్ల వాతావరణ ప్రభావంతో బాగా శీతలంగా నీరు వుండి గడ్డ కడుతుంది. ఈ రకంగా ఏర్పడిన గడ్డలన్నీ కలిసి పెద్ద ఆకారంలో ఐస్‌బర్గ్‌గా రూపొందుతాయి. వీటిని తాకితే పెద్ద పెద్ద ఓడలు(టైటానిక్ తరహాలో) కూడా బద్దలైపోతాయి. మంచు పర్వతాల సాంద్రత తక్కువగా వుంటే సముద్రపు జలాల ఉపరితలానికి కనిపిస్తాయి. నీటి సాంద్రత కంటే ఎక్కువగా వీటి సాంద్రత ఉన్నట్లయితే సముద్ర ఉపరితలానికి చేరవు, మనకు కన్పించవు. మామూలు కొండల మీద మంచు కురిసి మంచుకొండలుగా కనిపించే వాటికి ఉదాహరణగా సిమ్లా కొండలను చెప్పుకోవచ్చు. బాగా శీతాకాలంలోనే ఇవి ఏర్పడతాయి.

**-సి.వాసుదేవ్,** కాకినాడ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. క్రికెట్ ఆడుతున్నప్పుడు బౌలర్లు బంతిని తొడమీద రుద్దుతారెందుకు?**

**జవాబు: వాసుదేవ్!** బౌలర్లు తొడ మీద బంతిని రుద్దడాన్ని రబ్బింగ్/షైనింగ్ అంటుంటారు. తొడ మీద వున్న ప్యాంట్ మీద రుద్దడం వలన బంతికి మరింత నునుపు ఏర్పడి, హెచ్చు స్థాయిలో స్వింగ్ అవుతుందనే అభిప్రాయంతో బౌలర్లు ఆ విధంగా చేస్తుంటారు.ఫాస్ట్ మీడియం బౌలర్లేబంతిని రుద్దడం అలవాటుగా చేసుకున్నారు.







# పసందైన ఓనం వంటలు

**మన** తెలుగువారికి ఎంతో పరిచయం ఉన్న రాష్ట్రం కేరళ. అక్కడ ఉన్న ప్రదేశాలు కూడా చాలామందికి తెలుసు. మున్నార్, తెక్కిడి, గురువాయూర్, శబరిమల, కేరళ రాజధాని తిరువనంతపురంలోగల అనంత పద్మనాభస్వామి వంటి ప్రసిద్ధ దేవాలయాలు ఉన్నాయి. బహుబలి, ఏమాయ చేసావే వంటి సినిమా షూటింగులు కూడా ఇక్కడ జరిగాయి. మనదేశంలోనే కేరళకు ఓ ప్రత్యేకత స్థానం ఉంది. ఈరాష్ట్ర ప్రజలు సెప్టెంబరు నెలలో ఓనం పండుగ ఘనంగా జరుపుకుంటారు. పది రోజులపాటు భారీవేడుకలుగా జరుపు కుంటారు. తెలుగువారు కూడా కేరళ చీరెల్ని కట్టుకుంటారు. పలురకాల పిండివంటలతో విందుని చేసుకుంటారు. విందుని కేరళ భాషలో 'సద్య' అంటారు. ఓనం పండుగపై ఓ కథ ఉంది మనకి తెలిసినదే. మహాబలి చక్రవర్తిని వామన రూపుడైన విష్ణుమూర్తి మూడు అడుగులు స్థలం కావాలి అన్నారు. అదివిని బలి చక్రవర్తి తీసుకోమన్నాడు. అపుడు వామనుడు ఒక కాలు భూమి మీద రెండో కాలు ఆకాశంలో ఉంచాడు మరి మూడో అడుగు కోసం బలిచక్రవర్తి తన శిరస్సు మీద పెట్టమన్నాడు. ఈ విధంగా బలి చక్రవర్తిని పాతాళంలోనికి తొక్కేసాడు. అపుడు ఒక కోరిక కోరాడు బలిచక్రర్తి తన ప్రజలను సుఖంగా చూడాలి ఒక్కరోజు. ఆవిధంగా ఆగస్టు, సెప్టెంబరు నెలలో తిరువోణం రోజు భూమి మీదకి వస్తారని నమ్మకం. మరి 'ఓనం' సందర్భంగా కేరళ వంటకాలను రుచి చూద్దాం.

## అవియల్



అవియల్ కేరళ వారి ప్రియ మైన కూర. దీనిని మనం కలకూర అంటారు. మంచి రుచి పోషకాలు ఉంటాయి. దీన్ని కాయకూరలతో చేస్తారు.

**కావలసినవి:** మునక్కాయలు, వంకాయ, బంగాళదుంప, కేరట్, అరటికాయ చెరొకటి. పొచిమిర్చి రెండు, కొబ్బరి నూనె నాలుగు స్పూన్లు, పెరుగు అరకప్పు, జీలకర్ర, పసుపు పొడి అర స్పూన్ చొప్పున, కొబ్బరి తురుము అరకప్పు, బూడిద గుమ్మడికాయ, పొట్లకాయ, దోసకాయ, కంద పావుకిలో చొప్పున కావాలి.

**అవియల్ తయారీవిధానం:** అన్ని కాయగూరలు తొక్కతీసి రెండు ఇంచుల పొడవున కోసి ఉంచాలి. తగినంత పసుపు పొడి, ఉప్పు, కరివేపాకు, కొబ్బరి నూనె ఈ ముక్కలలో వేసి నలిపి అరగంట ఉంచాలి. తరువాత వందమిల్లీలీటర్ల నీటిలో కాయకూర ముక్కలను వేసి సన్నని సెగమీద ఉడకపెట్టాలి. కొబ్బరి తురుము జీలకర్ర పచ్చిమిర్చి నీరు కలపకుండా దంచాలి. సన్నని సెగమీద ఉడుకుతున్న దానిమీద దంచిన వాటిని వేసి కలపాలి. బాగా ఉడికినపుడు పెరుగు కొబ్బరి నూనె కరివేపాకు వేసి కలిపి దించి మూతపెట్టాలి. అంతే అవియల్ తయారు.

## చక్క పాయసం



చక్కపాయసం అంటే పనసపండు పాయసం. మంచి రుచిగా ఉండడం మాత్రమేకాక తయారీ విధానం కూడా సులభమే.

**కావలసినవి:** బెల్లం, మంచినీరు అరకప్పు చొప్పున, పనసపండు అరకప్పు,కొబ్బరిపాలు రెండు కప్పులు, ఏలకులు నాలుగు రెండు స్పూన్ పంచదారలో వేసి పొడి చేసి ఉంచాలి. పుట్టుపొడి మూడు స్పూనులు, నెయ్యి పెద్దస్పూను, జీడీ పప్పు బాదాం ముక్కలు చేసినవి కొంచం ఉంచాలి.

**చక్కపాయసం తయారీ విధానం**



బెల్లం నీటిలో కలిపి కరగా పెట్టి ఉంచాలి. పనసపండు పిక్క తీసి సన్నగా కోసి పెట్టాలి. గిన్నెలో పుట్టుపొడి, నీరు, కప్పుడు కొబ్బరిపాలు పోసి సన్నని సెగమీద పెట్టి కలపాలి.అడుగు పట్టకుండా గమనించాలి. ఇది ఉడికినప్పుడు తురిమిన పనసపండు వేసి ఉడికిన తరువాత పంచదార ఏలకుల పొడివేసి నెమ్మదిగా కలపాలి. ఇందులోకి కరగా పెట్టిన బెల్లం పానకం పోసి సెగ మీద ఉంచాలి.

అప్పుడు కొబ్బరిపాలు కప్పుడు పోసి చిన్న సెగ మీద ఉడికించి దించాలి. నేయ్యిలో జీడీ పప్పు బాదాం ముక్కలు వేసి వేయించాలి. దీనిని పాయసంలో వేసి మూత పెట్టి ఉంచాలి చక్క పాయసం రెడీ. దీనిని చక్క ప్రథమన్ అంటారు.



**పుళిఇంజీ పచ్చడి**

పుళి ఇంజీ అనబడే పచ్చడి ఇది ప్రత్యేకమైనది తీయగా, కారంగా ఉంటుంది. దీని అల్లంతో చేస్తారు.

**కావలసిన:** అల్లం తొక్క తీసి సన్నగా తురిమిపెట్టుకోవాలి. కొన్ని పచ్చిమిర్చి తురిమిపెట్టుకోవాలి. చింతపండు నిమ్మకాయసైజు నీటిలో నానపెట్టి పిండి,నీరు ఉంచాలి. ఒక కప్పుడు. బెల్లంపొడి పెద్ద స్పూను కావాలి, ఉప్పు తగినంత, కొబ్బరి నూనె స్పూన్, ఆవాలు చిన్న స్పూన్, కరివేపాకు రెమ్మ ఒకటి.

**పుళిఇంజీ తయారీ విధానం:**

అల్లం, పచ్చిమిర్చి తురుము నూనెలో దొరగా వేయించాలి.



ఇందులోకి చింతపండు నీరు, బెల్లం పొడి ఉప్పుపోసి మారగా పెట్టాలి. బాగా చిక్కపడుతున్న ప్పుడు స్టౌ మీద నుండి దించాలి. ఇందులోకి కొబ్బరినూనె ఆవాలు కరివేపాకు తాలింపు పోయాలి. అంతే పుళిఇంజీ పచ్చడి రెడీ.

**కాళ్లన్ వంటకం:** ఈ వంటకం కేరళ వాళ్లకి ఎంతో ముఖ్యం.

**కావలసినవి:** మామిడి పండు ఒకటి నాలుగు ముక్కలుగా కోసినది, దోసకాయ ముక్కలు ఒక కప్పు, పనసపిక్క రెండుగా ముక్కలు చేసినవి అర కప్పు, ఉప్పు తగినంత, పసుపు పొడి చిన్న స్పూన్, కొబ్బరి తురుము రెండు కప్పులు, మిరియాలు తగినంత, ఎండు మిరపకాయలు మూడు, పచ్చి మిర్చి రెండు, జీలకర్ర, ఆవాలు చెరో స్పూన్, కొబ్బరి నూనె రెండు స్పూన్, పెరుగు రెండు కప్పులు, మెంతులు తగినంత, కరివేపాకు ఒక రెమ్మ.

**తయారీవిధానం:**

మామిడిపండు, దోసకాయ, పనసపిక్క పసుపుపొడి నాలుగు కప్పుల నీటిలో పోసి ఉడకపెట్టాలి. ఇందులోకి కొబ్బరి తురుము, మిరియాలు, ఎండుమిరప, పచ్చిమిర్చి, జీలకర్ర, కొబ్బరి నూనె ఆవాలు మెంతులు కలిపి మెత్తగా నూరాలి. అందులోకి పెరుగుపోసి కలపాలి. బాగా ఉడికిన ముక్కలలోకి నూరిన ముద్దని బాగా కలపాలి, దీనిని ఒక్క నిమిషం పెద్ద మంటలో ఉంచి దించాలి. ఇందులోకి తాలింపు పోయాలి. ఇంకా అప్పడాలు తప్పని సరిగా చేసుకుని, తింటార. దేశవ్యాప్తంగా కేరళ వారు ఎక్కడ ఉన్నా ఈ ఓనం పండుగను ఘనంగా జరుపుకుంటారు.

**- ఈ.ఎస్.మాధవన్**

# ఎన్నాళ్లీ హింస?

**(11వ పేజీ తరువాయి)**

ప్రవర్తించాడు అంటాం కాని మృగాలు కేవలం వాటి శారీరక ధర్మాలకు మాత్రమే స్పందిస్తాయి. మణిపూర్‌లో మాత్రమే జరుగుతున్నాయి అంటున్నారు. నిజమే అత్యాచారాలు, సామూహిక మానభంగాలు, హింసాత్మక ఘటనలు దేశంలో అన్నిచోట్లా జరిగాయి. జరుగుతున్నాయి. కాని తప్పు ఎక్కడ జరిగినా, ఎప్పుడు జరిగినా తప్పే. కొన్ని సంఘటనలు వెలుగులోకి రావడానికి, ప్రాముఖ్యత సంతరించుకోవడానికి






వెనుక అనేక కారణాలు ఉంటాయి. 'నిర్భయ'కి ముందు ఆ తరువాత కూడా అటువంటి దారుణ పైశాచిక మానభంగాలు చాలా జరిగాయి కాని 'నిర్భయ' ఘటన దేశాన్ని అతలాకుతలం చేసింది. ఆ చైతన్యం నుంచి 'నిర్భయ' చట్టం వచ్చింది. దీనివల్ల అటువంటి సంఘటనలు ఆపగలిగాయా అంటే లేదు. కారణం మనుషులలో సామాజిక చైతన్యం లోపించడమే. మనకెందుకు అని ఊరుకుని ఉండటమే. ద్రౌపది మానభంగం కురువంశ నాశనానికి కారణమైంది. నేడు రావణకాష్ఠంలా మండుతున్న మణిపూర్‌లో సమిధగా మారిన స్త్రీల రోదన ఏ అవాంఛనీయ పరిణామాలకు కారణమవు తుందో కాలమే చెప్పాలి.

**- కూచిమంచి నాగమణి**

కథ

# మా వీధి

**పి. భారతీకృష్ణ**



**మా వీధిలోకి పుల్లేటి కుర్రు ఊరి నుండి బట్టల షావుకారు వచ్చాడంటే ఆ వీధిలో ఆడవాళ్లకు పండగే. పెద్ద బట్టలమూట సైకిల్‌కి కట్టుకొని, సరిగ్గా మధ్యాహ్నం రెండు గంటలు దాటాక సైకిల్ బెల్ గణగణా మోగిస్తూ రయ్యిమంటూ వచ్చి, ఓ ఇంటి ఎత్తు అరుగు మీద మూట దింపేవాడు.**

బిలబిల్లాడుతూ అక్కడికి చేరిన ఆడవాళ్లంతా తమకు నచ్చిన చీరెలు ఎంచుకొని, బేరం మొదలుపెట్టేవారు. ఈ బేరాలు ఓ పట్టాన కుదిరేవి కావు. మాటలతోటే ఆట పట్టిస్తూ చాలా చవక రేటుకే అడుగులూ "నీ కోసమే ఎదురు చూస్తున్నాం తెలుసా, పోయినసారి నీ దగ్గర కొన్న కోకలే. అమలాపురం షావుకారొచ్చినా కొనలేదు తెలుసా! తీరా ఇప్పుడు నువ్వేమో రేటు తగ్గించడానికి ఓ ఇదయిపోతున్నావ్?" అంటుండేవారు.

ఈ బడాయి మాటలన్నీ అతనికేమైనా కొత్తా? "పడదండి.. నాకు మల్లే ఇంత చవగ్గా ఇంకొకళ్లు ఇస్తారేటండీ! ఆయ్ పో.. నాలాగే ఇంకో షావుకారు దగ్గరే తీసుకోండి" అంటూ మూట కట్టేస్తూ వుండేవాడు. అలా నాలుగైదు సార్లు మూట కట్టీ, విప్పేసరికి సులువుగా సాయంత్రం అయిపోయేది. సరే.. కొన్నమ్మ కొనేది, కొననావిడ "వచ్చేవారం నేనడిగిన గడి వున్నవే తేవాలి సుమా" అనేది.

సందట్లో సడేమియాలాగా ఓ పెద్దావిడ వచ్చి "ఏరా అబ్బాయ్! నేనడిగిన రూబీ జాకెటుముక్కలు తెచ్చావా లేదా?" అని నిలదీసేది.

అప్పటికే నీరసించి అతను "ఈ వారం కుదరలేదండీ, వచ్చే వారం అట్టుకొచ్చి బోణీ మీ చేతే చేయిత్తానండి" అంటూనే సైకిలెక్కేసి వెళ్లిపోయాడు.

మా ఊరు చాలా అందమైనది. చుట్టూ పచ్చని పంటపొలాలు, నిండైన గోదావరినీళ్లు, ప్రశాంతమైన వాతావరణంతో ఎంతో బావుంటుంది. అలాంటి ఊరిలో ఇంకా అందమైనది మా వీధి. ప్రతీ వాకిలీ సంస్కృతి, సాంప్రదాయం ప్రతిబింబిస్తూ వుండేది. వీధి చివరలో వికసించిన తామరపూలతో ఆహ్లాదపరిచే చెరువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది. తాగడానికి ఆ నీరు పనికి రాకపోయినా అందరి ఇంటి వాడకానికీ ఉపయోగపడేది. మంచినీళ్లు పెద్దకాలువ నుండి తెచ్చుకొనేవారందరూ.

మా వీధిలో వున్న పది కుటుంబాలవాళ్లు ఎంతో కలివిడిగా వుండేవాళ్లు. పండగలొస్తే పిండివంటలు ఒకరింటికొకరు పంపించుకునేవారు. ఎండా కాలంలో ఊరగాయల హడావుడి అంతా ఇంతా కాదు. వంద కాయ ఆవకాయ, వంద కాయ మాగాయ, ఏభై కాయ మెంతికాయ, ఏభై కాయ తొక్కుడు పచ్చడి.. ఇంచుమించు అందరిళ్లల్లోనూ ఇలాగే పెట్టేవారు. కాయ రాగానే పిల్లా పెద్దా ఆ ఇంట్లో చేరి, సరదాగా కబుర్లు చెప్పుకుంటూ కాయలన్నీ శుభ్రం చేసేవారు. మరుసటి రోజు ఇంకొకరింట్లో ఇలా అందరి ఊరగాయలు అయ్యేవి. ప్రతీ ఇంటివాళ్లు పెరట్లో నారింజకాయలు కోసి, చక్కెర కలిపి ఆ టైమ్‌కే డబ్బా వాయించుకుంటూ ఐసుబండి కుర్రాడొచ్చేవాడు. అతని దగ్గర ఎరుపురంగు పుల్లైసులు కొని ఈ రసంలో కలిపేసి, షర్బత్తని తలో గ్లాసుడు పోసేవారు. పోటీపడి తాగేసేవాళ్లం. తల్చుకుంటే నవ్వొస్తుంది.

మూడు రోజుల తర్వాత, పెట్టిన ఊరగాయలు వచ్చి చూడండంటూ, రుచెలా వుందో చెప్పండంటూ మళ్లీ ఒకరింటికొకరు పంపించేవారు. అప్పడాలు వత్తేటప్పుడైతే అప్పట్లో, రేడియోలో సంక్షిప్త శబ్ద చలనచిత్రమని వేసేవారు. అది వింటూ అప్పడాల కార్యక్రమం ముగించేసేవారు. ఎవరింట్లో ఆడపిల్ల పురిటికి వచ్చినా బిడ్డను కని, ఆ పిల్ల క్షేమంగా వెళ్లేవరకూ వీధిలో అందరూ ఎంతో అపురూపంగా చూసుకునేవారు.

మేం ఓ పది మంది కుర్రాళ్లం ఉండేవాళ్లం. చాలా స్నేహంగా సరదాగా కలసిమెలసి వుండేవాళ్లం. సాయంత్రం దివాణం చెరువులో స్నానం చేయడం, పెద్ద కాలువలో ఈతకొట్టడం, దీపావళికి మతాబులు, చిచ్చుబుడ్లు, జువ్వలు ఇంట్లోనే తయారు చేయడం, సంక్రాంతికి భోగిమంటలు వెయ్యాలని ఎండుకర్రలన్నీ నాలుగు రోజుల ముందే సేకరించడం.. అంతేనా! ఆడపిల్లలతో కలసి కుంటాట ఆడటం, మా పెరట్లో ఏడు పెంకులాటలాడుతూ అల్లరి చేయడం, సాయిగాడైతే ఏ కాయ కోసినా చొక్కా అడ్డమేసి కొరికి కాకి ఎంగిలంటూ అందరికీ తలో ముక్కా పంచేవాడు. ఆ సందడి ఇంతా అంతా కాదు.

ఆ మధ్య ఒకసారి సీతారావుడు రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో కలిసాడు. చిన్నప్పటి సంగతులన్నీ మాట్లాడుకుంటుంటే మాకు సమయమే తెలియలేదు. ఎంత సాహసాలు చేసేవాడో!

ప్రమాదాన్ని కూడా లెక్క చేసేవాడు కాదు. హనుమంతు మావయ్య ఇంట్లో ధాన్యం నింపిన పురి దగ్గర, పిల్లలెవరో ఆటలాడుతూ అగ్గిపుల్ల విసిరేసరికి, గడ్డితో చేసిందేమో, అది అంటుకొని మండిపోసాగింది. వీధిలో వున్న జనమంతా మూకుమ్మడిగా వచ్చి పక్కనే వున్న పంటకాలవలోని నీళ్లు, బిందెలతో తెచ్చి మంటలార్పసాగారు. వీడు మాత్రం ప్రాణాలకు తెగించి గడ్డివాముపైకి ఎక్కి మండుతున్న గడ్డినంతా కిందికి తోడేసి చల్లబరిచాడు. ఒకటా.. రెండా.. నీది, నాది, నీ వాళ్లు, నా వాళ్లు అని చూడకుండా మేమంతా అన్నింటిలో పాలు పంచుకునేవాళ్లం.

మా వీధిలోనే మా మాస్టార్ల ఇళ్లు కూడా వుండేవి. ఎంత అల్లరి చేసినా సున్నితంగానే మందలిస్తూ వుండేవారు.

పెద్దవాళ్లంతా కాలంలో కలిసిపోయారు. నా స్నేహితులంతా ఉద్యోగాలొచ్చి ఎవరు ఎక్కడున్నారో తెలియదు. ఆడపిల్లలందరికీ బహుశా పెళ్లిళ్లయిపోయి వుంటాయి.

ఆ రోజుల్లో ఆ ఆనందం మళ్లీ తిరిగిరాదు.. మారిపోయిన ఈ రోజుల్లో ఉమ్మడి కుటుంబాలే కరువైపోయాయి. తీరిక దొరకని బిజీ బతుకులు అయిపోయాయి. నా తరం వాళ్లకీ సర్దుకుపోవడం రాక, ఏదో యాంత్రికంగా గడిచిపోతున్నాయి రోజులు. మాకు మాత్రమే సొంతమైన ఇంత చక్కని అనుభవాలు, అనుభూతులు, రాబోయే తరాలకు గగన కుసుమాలనే చెప్పాలి.

ప్చ్... ఏమిటో పరుగుల కాలం? మాటిమాటికీ అశాంతికి లోనౌతున్న మనసు చక్కని వాతావరణంలో సేద దీరాలని కోరుకుంటోంది.


చాలా సంవత్సరాల తర్వాత ఊళ్లోకి అడుగు పెట్టిన నాకు ఈ జ్ఞాపకాలన్నీ ఒక్కసారిగా చుట్టుముట్టేసాయి. అందరూ ఇళ్లు అమ్మేసినా నాన్నగారి గుర్తుగా వుంటుందని నేను మాత్రం మా ఇల్లు అమ్మలేదు. పదవీ విరమణ చేసి, నా భార్య కమలతో కలసి ఈ ఊళ్లో మా వీధిలో వుండాలనేది నా కోరిక.

కానీ ఇప్పుడు పిల్లలు ఈ ఊరు రావడానికి, ఇక్కడ వుండడానికి ఇష్టపడటం లేదు. "అమ్మకి అనారోగ్యంగా వుంటోంది కదా, ఎలా వుంటారక్కడ? సరైన వైద్య సదుపాయం లేదు కదా. ఈ వయసులో రిస్క్ ఎందుకు? ఆలోచించండి" అనేసారు. వాళ్ల మాటలకు తగ్గట్టుగానే ఊరి పరిస్థితిలో ఏ మార్పూ లేదు. కమలతో కలసి వుండాలంటే కొంచెం కష్టమే.

నేనీ వీధిలో అడుగు పెట్టగానే నన్ను గుర్తుపట్టి ఎంతో సంబరంగా పలకరించింది అప్పట్లో మా స్కూల్లో బంట్రోతుగా పని చేసిన సుబ్రావు.

"అయ్యా, మీ ఇల్లు కొనడానికి ప్రభుత్వాసుపత్రి డాక్టరు గారు సిద్ధంగా వున్నారయ్యా. కబురు చెప్పమంటారా" అని వచ్చినప్పటి నుండీ అడుగుతున్నాడు. పిల్లలు, కమల ఉద్దేశం కూడా ఇంచుమించు ఇదే. ఒకప్పుడు పది కుటుంబాలతో కళకళలాడిన ఈ వీధిని తల్చుకుంటేనే మనసు ఆ రోజుల్లోకి పరుగు పెట్టేసి ఆత్మీయతలతో, ఆప్యాయతలతో పెనవేసుకుపోతోంది. అన్ని కుటుంబాలవారు ఎలాంటి అరమరికలు లేక ఒకే కుటుంబంలా కలిసిపోయి, ఒకరి కష్టసుఖాలు ఒకరు పంచుకునేవారు. పెద్దవాళ్లలో చెప్పాల్సి వస్తే హెడ్ మాస్టారు, వారి అరుగు మీదే కూర్చొని హరికేన్ లాంతర్లు పెట్టుకుని చదువుకునేవాళ్లం. ఇంకా హోమియోపతి డాక్టరుగారు, డ్రాయింగ్ మాస్టారు ముఖ్యంగా హార్మోనియం చక్కగా వాయించి 'అదిగో ద్వారక.. ఆలమందలవిగో' అని పద్యాలు వినిపించే హనుమంతు మావయ్య, అటువైపుగా చెరువు పక్కనుండే ఇంట్లో సత్యవతమ్మగారు, ఆధ్యాత్మ రామాయణ కీర్తనలు, రోజూ సాయంత్రంపూట వీధి మారుమోగిపోయేలా అరుగు మీద కూర్చొని అదేపనిగా పాడుతుండేది. ముఖ్యంగా అన్నపూర్ణమ్మగారు ఆవిడ మా వీధిలో పిల్లలందరికీ మామ్మగారే. పరీక్షలొస్తేచాలు, తెల్లవారుజామునే అందరినీ 'లేవండి.. చదువుకోండంటూ' పేరు పేరునా పిలుస్తూ ప్రతీ ఇంటికీ వచ్చి లేపుతుండేది. ఆ సమయంలో ఆవిడను బాగా తిట్టుకున్నా ఈ రోజు ఇలా ఉద్యోగాలు చేసుకుంటున్నామంటే మామ్మగారి ప్రోత్సాహం కూడా ముఖ్య కారణమే. పెరట్లో కాసిన కూరగాయలు ఇంటింటికీ పంచిపెట్టడమే, అమ్ముకోవడాలు లేవు. ఇంత మంచి అనుభూతులను, ఆ మనుషులను... వీళ్లందరినీ ఎలా మర్చిపోవడం? వాళ్లందరూ వెళ్లిపోయుండొచ్చు.. కానీ వారిని ఎలా మర్చిపోవడం? "ఎక్కడున్నా తల్చుకోవచ్చు నాన్నగారూ" అని పిల్లలంటారు.

"ఆ... సుబ్రావ్... అన్నీ సర్దేసావా?"
"అయ్.. తమరు చెప్పినట్టుగానే పెరట్లో కాసిన కాయలు, పండ్లు, కొబ్బరిబోండాలు, సివరాకరికి కరివేపాకు కూడా నాలుగు కట్టలు కట్టానయ్యా. మీకు ఇష్టమన్నారని తేగలు కూడా సంచిలో సర్దేసానండి".




అవును నిజమే. ఇన్నాళ్లూ అలాగే గడిపాను. రిటైర్ అయ్యాక నా మనసు మాత్రం ఈ వీధితో మరింత అనుబంధం పెంచుకోమంటోంది. ఈ ఇల్లు అమ్మాలా? వద్దా? అనేది రేపు చెప్తానని సూబ్రావుతో అన్నాను. చూడాలి.. రేపటి నా నిర్ణయం ఎలా వుండబోతుందో!

............

"ఆ... సుబ్రావ్... అన్నీ సర్దేసావా?"

"అయ్.. తమరు చెప్పినట్టుగానే పెరట్లో కాసిన కాయలు, పండ్లు, కొబ్బరిబోండాలు, సివరాకరికి కరివేపాకు కూడా నాలుగు కట్టలు కట్టానయ్యా. మీకు ఇష్టమన్నారని తేగలు కూడా సంచిలో సర్దేసానండి".

"సరే సూబ్రావ్.. పాతవాళ్లెలాగూ ఖాళీ చేసారు కాబట్టి ఇల్లు డాక్టరు గారికిచ్చి నేను వెళుతున్నాను.



# చెట్టుబంధం

**నేనొక చెట్టుని చాలా రోజులుగా చూస్తున్నాను. ప్రత్యక్షంగా చూడటంతో ఏర్పడిన బంధమేమో తెలీదు. కానీ ఆ చెట్టు నా కలలోనూ కనిపిస్తుంది. నన్ను పలకరించి గుసగుసలాడుతుంది. గాలికి అనువుగా చేస్తున్న నృత్యాన్ని చూడమంటుంది.**

అది తన జీవన పోరాటం గురించి ఎన్నో కబుర్లు చెబుతుంది. భూమి అడుగున అల్లుకున్న వేరు మొదలుకుని పై కొమ్మ వరకూ ఎదిగిన తీరుని చెబుతూ ప్రేమనూ ప్రకృతి నుంచి పొందే సంరక్షణనూ వివరిస్తుంటుంది కలలో.

ఆ చెట్టుకెన్ని కొమ్మలో..!

నలు దిశలా విస్తరించిన కొమ్మలవి. పచ్చని ఆకులతో పువ్వులతో కళకళలాడుతూ కనిపిస్తుంటుంది. కొన్ని కొమ్మలైతే నింగిని తాకేయా... అన్నంత ఎత్తుకున్నాయి.

మొగ్గలన్నీ సూర్యకిరణాల తాకిడితో వికసించిన తీరుని పరిమళభరితంగా చెప్తుంటుంది. సూర్యరశ్మి తనకెంత ఇష్టమో విడమరిచి చెప్తుంటుంది.

అది విత్తనం నుంచి తలెత్తి చిగురించి మొక్కై మానై పువ్వులతో కళకళలాడిన ప్రతి దశనూ కథలు కథలుగా చెప్తుంటే నా జీవితంలోని దశలూ కళ్ల ముందు కదలాడాయి.

అది చెప్పే ప్రతి మాటనూ వింటున్నాను తదేకంగా. మా ఇద్దరి కథా ఒకేలా ఉంది.

ఎన్నెన్ని ప్రయాణాలో.. ఎన్నెన్ని మలుపులో..

నేను పై కొమ్మను చేరుకున్నాను. ఈ కొమ్మ కాస్త సన్నగా బరువు తక్కువగా ఉండొచ్చు. కానీ కాండం బలంగా ఉంది. ప్రేమానురాగాలు ఎక్కడికక్కడ పరామర్శిస్తూ భరోసానిస్తూ ఆనందాన్నిస్తూ కన్నీళ్లను తుడుస్తూ ఎన్ని అనుభూతులో.. ఎదిగే క్రమంలో!

మూలాలైన వేళ్లు కంటికి కనిపించకపోవచ్చు. కానీ నిజం మరచిపోలేనుగా. కాంతికిరణాల తాకిడితోనేగా నేనంత ఎత్తుకిఎదిగాను.

కానీ.. ఇప్పుడు నా ముందో ప్రశ్న లేకపోలేదు. రేపో మాపో నేనుండను. అప్పుడు కూడా ఉండే ఈ చెట్టు తన కథను నా తదనంతర సంతతికి చెప్తుందా లేదా.. అలా చెప్పినప్పుడు నా ప్రస్తావన ఉంటుందా? ఏమో మరి! ఇప్పటికైతే అది నా చెవిలో గుసగుసలాడుతున్న కథలన్నీ వింటూనే నిద్దట్లోకి జారిపోయాను.

**- యామిజాల జగదీశ్**

---



సూర్రావ్, ఒక్క విషయం గుర్తు పెట్టుకో, నేను నెలా నెలా వచ్చి ఇక్కడ కొన్ని రోజులు వుండాలని అనుకుంటున్నాను.. ఇదిగో ఈ డబ్బు వుంచుకో..."

"అలాగేనయ్యా.. తమరు వస్తా, పోతానంటే ఎంతో సంబరంగా వుందయ్యా. కానీ తమరు ఇల్లు అమ్మేస్తున్నారాయ్యా?"

"చూడు, ములక్కాడలు మర్చిపోయినట్టున్నావ్! మరీ మరీ తెమ్మని చెప్పింది కమల.

"లేదయ్యా.. నిమ్మకాయలతో పాటే ముందే సంచిలో సర్దేసానయ్యా"

"ఆయ్... ఇంతకూ తమరూ...."

"ఆ, ఇంకో విషయం... తూర్పు వైపు గది నేను వుంచుకుంటున్నాను. కాస్త శుభ్రం చేస్తూ వుండు"

"అంటే ఇల్లు..?"

"అవును.. సూర్రావ్? డాక్టరు గారికి అద్దెకిచ్చి వెళుతున్నాను"

"అవునా? అమ్మట్లేదు కదా బాబూ... సంతోషమయ్యా. తమరు ఇక్కడున్నారంటే చూడండి... మరిన్ని కూరలు పండించేత్తాను.. ఆయ్"

ఆ మాటతో పెద్దవాడైన సూర్రావ్ కళ్లల్లో పసిపిల్లాడి ఆనందం కొట్టొచ్చినట్టు కనపడింది.

"నీకే కాదు నాకు కూడా... నేను బతికున్నంత కాలం ఈ ఆనందం నాకు దూరం కాదు, కానివ్వను సూర్రావ్. నేనిక్కడున్నానని తెలిసి నా స్నేహితులు నన్ను చూడ్డానికి వస్తారేమో. కరిగిపోయిన గతం మళ్లీ మా మధ్య కొత్తగా చిగురిస్తుందేమో చూద్దాం!"

"సరే.. పదండి బాబూ, తమరిని బస్సు ఎక్కించి వస్తానయ్యా..."

ఇంటి తాళాలు సూర్రావుకిస్తూ మా వీధినొకసారి ప్రేమతో పరికించి చూస్తోంటే కళ్లు రెండూ ఆనంద బాష్పాలతో పూర్ణ కలశాలైపోయి హృదయాన్ని తడిపేసాయి. ■

# ఎక్కడిదీ శివశక్తి గంగావతరణం?

కవి సమ్రాట్ విశ్వనాథవారికి, నేను స్వయంగా రచించిన గగన గంగావతరణం చదివి వినిపించి వారి స్పందన కళ్లారా చూడాలని మా సహజన్ముంలం అందరం విజయవాడలో వారి ఇంటికి వెళ్లాం.

నా ఆధునిక వేషధారణ చూసిన విశ్వనాథవారు వినటానికి కూడా ఆసక్తి చూపలేదు.

“అక్కడ పెట్టి వెళ్లండి, నేను తీరికగా చదువుతా” అన్నారు నిరాసక్తంగా.




మా ముఖాలలో నిరాశ నిస్పృహలు చూసి “సరే.. బాగా రాశాననుకున్నవి పది పంక్తులు చదివితే వింటా” నన్నారు. చేతికొచ్చిన పేజీ తెరచి గబగబా నాలుగు కప్లెట్సు చదివాను.

ఆపమని, ఆది నుంచి మళ్లీ నిదానంగా చదవమన్నారు. సంభ్రమాశ్చర్యాలను అణచుకొంటూ మొదటి నుంచి చదువుతుంటే ఆ మహాకవి అక్కడే వున్న శిష్యవర్గంతో ఆ కావ్య పద్యాలలోని శయ్య, శిల్పం, శబ్దగాంభీర్యం, అల్లిక, తెనుగు నుడికారం అంటూ శ్లాఘించడం మాకు హర్షాతిరేకం కలిగించింది. నా మానసిక స్థితి మాటలలో చెప్పలేని స్థాయికి చేరింది. చివరివరకూ కవి సమ్రాట్ నా కావ్యం వినడం మమ్మల్ని ఆరోజు ఆనంద జలధిలో ముంచింది.

ఆయన అంతటితో ఆగలేదు. ఇంట్లోకి వెళ్లి ఫలపుష్ప పత్రాలతో, పట్టు వస్త్రాలతో కుంకుమాక్షలతో తన శ్రీమద్రామాయణ కల్పవృక్ష ఆవిష్కరణ సందర్భంలో పొందిన సత్కార పట్టువస్త్రాలు నాకు అనుగ్రహించి ఆశీర్వదించారు. వారు, వారి ప్రియ శిష్యగణం, సుపుత్రులు, వాత్స ల్యగరిమ ముక్తకంఠాలతో, మంత్రపుష్పాలతో ఆశీర్వదించి, అక్షతలు చల్లి నన్ను తమ గుండెలకు హత్తుకొని అభినందించిన సంఘటన ఎంతో అతిలోకానుభూతి, తృప్తి, రసోదీప్తి కలిగించింది. అది నా జీవన ప్రస్థానంలో నేటికీ తలచుకొంటున్న మహాద్భుత ఘట్టం.

“ఇప్పుడు నువ్వు రాసిన ‘గగన గంగావరతణం’ విన్నాక నా అంతరాత్మ ఆ అగ్రతాంబూలం నీది అని నొక్కి చెపుతోంది” అంటూ దాదాపు 25 సంవత్సరాల క్రితం కవి సమ్రాట్ మహాకవి విశ్వనాథ తనను అభినందించిన సంఘటన ఆ కవివరేణ్యుని ఔదార్యం, సంయమన నిరాడంబర అభిజ్ఞతకు నిదర్శనమని, తెలుగు చలనచిత్ర ప్రాభవాన్ని ‘ఆస్కార్’ అంతర్జాతీయ శిఖరాగ్రంపై అధిష్ఠింపచేసిన ‘కోడూరి’ కుటుంబ అగ్రగామి శివశక్తిదత్తా ఒక ప్రస్తావనలో గుర్తు చేసుకున్నారు.

**“చిట్టి చిట్టీ చిట్టి చీమలమర్రి**
**మర్రికిందా నుండె వెర్రిజంగమ్ము**
**వెర్రి జంగమ్మునకు వేవేల జడలు**
**జడలలో నున్నది జాబిల్లిరేక**
**జాబిల్లిరేకపై జారు చదలేరు**
**జాహ్నవీ గంగమ్మ జేజేలు నీకు”**

చిన్ననాట అమ్మనోట విన్న ఈ చిన్నిపాట ‘గగన గంగావతరణం’ కావ్యసృష్టికి స్ఫూర్తిగా ‘వెర్రి జంగమ్ము’, ‘వేవేల జడలు’, ‘జాబిల్లి రేక’, ‘జాహ్నవీగంగ’ నాటి నుంచి నేటి వరకూ ముగ్ధణ్ణి చేస్తున్నాయంటారు శివశక్తిదత్తా.

కోడూరి వారిది ‘బాహుబలి’ కుటుంబం. దశాబ్దాల తరబడి వయోపరిణతి, అవిశ్రాంత సంగీత, సాహిత్య సాధనా తత్పరత శివశక్తిదత్తాను, కుటుంబ పెద్దగా నడిపిస్తోంది. సినీ కథా రచయిత కోడూరి విజయేంద్రప్రసాద్, చంద్రబోస్, మరకతమణి కీరవాణి, రాజమౌళి, శ్రీలేఖ, శ్రీవల్లి, కాలభైరవ, రమా రాజమౌళి ప్రత్యక్షంగా పరోక్షంగా తెలుగు సినీ ప్రేక్షకులకు సుపరిచితులైన ప్రతిభావంతులే. అందరూ ఒక కుటుంబంవారే.

తెలుగు చలనచిత్ర రంగంలో ‘కమలేష్’గా కుంచె పట్టిన ఒకప్పటి బాబూరావు, శివశక్తిదత్తాగా ప్రస్తుతం తెలుగు చలనచిత్ర రంగానికి ఆ కుటుంబం జగద్విఖ్యాతి కల్పించింది.

తెలుగు సాహిత్య ప్రక్రియలలో కథకు అగ్రతాంబూలం ఎప్పటి నుంచో లభిస్తోంది. సాంఘిక ఇతివృత్తాలే కాకుండా పౌరాణిక, చారిత్రక కల్పిత గాథలకు ప్రాధాన్యం యిచ్చిన తెలుగు సినిమాలు ఎన్నో విజయవంత మయ్యాయి.

విశ్వనాథవారి ‘ఏకవీర’ లాంటి సినిమాలు ప్రతిభావంతంగా కథ, పాటలతో జనాన్ని అలరించాయి. ‘శంకరాభరణం’ లాంటి సంగీత, నృత్య యితర కళారంగాల చిత్రాలను తెలుగు ప్రేక్షకులు సమాదరించారు. శివశక్తిదత్తా, విజయేంద్ర ప్రసాద్, కీరవాణి, రాజమౌళి అద్భుత విజయాలు కైవసం చేసుకొంటున్నారు. కవితలల్లే విద్య, కుంచె పట్టిన చిత్రకళా పరిణతి, శివశక్తిదత్తా సోదరుల మేధస్సు కీరవాణి, రాజమౌళిల సంగీత, దర్శకత్వ విలక్షణత తెలుగు సినిమాను ఉన్నత శిఖరంపై ప్రతిష్ఠించింది.

1961లో శివశక్తిదత్తా, తన కుమారునికి ‘కీరవాణి’ పేరు పెట్టడం, తాను ఆ రోజులలో విపరీతంగా అభిమానించిన ‘ఎందుకోయీ తోటమాలీ?’ ‘మల్లీశ్వరి’ చిత్రంలోని పాట కీరవాణి రాగం కావటమే. అది విచిత్రమైన ఉదంతం. ఆర్యావర్తం నాటి భారతీయ ప్రాచీన సాహిత్యంలో అమూల్యమైన కల్పిత గాథలున్నాయి. పౌరాణిక, చారిత్రక సాహిత్యం ప్రపంచాన్ని విస్మయపరిచే దృశ్య కావ్యాత్మకంగా ఇప్పుడిప్పుడే వెలుగు చూస్తోంది. డిజిటల్ సాంకేతికత గుప్పెట్లో వున్న ప్రపంచం, ఎవరెస్ట్ శిఖరం ఎక్కి, చంద్రబింబాన్ని స్పృశించగల వర్చుయాలిటీ, ‘ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్’ తెలుగు మేధస్సు ఆలంబనగా ప్రాచీన, అధునాతన సాహితీ సంస్కృత, సంస్కృతీ' సంపన్నత దృశ్య కావ్యాలుగా ప్రేక్షక జనావళిని సమ్మోహపరచడం 21వ శతాబ్దం నాటి పరమాద్భుత పరిణామం. తెలుగు సాహితీ మేధావంతులు భవిష్యదార్శనికులు.

**- జయసూర్య**

## గురుశిష్యుల బంధం

**(15వ పేజీ తరువాయి)**

అందుకు కారణం పని ఒత్తిడి పెరుగుతోంది, ఉపాధ్యాయులకు యాజమాన్యాలు మార్కుల టార్గెట్స్, అడ్మిషన్స్ సంబంధిత బాధ్యతలు అప్పగించడమే. ఉపాధ్యాయులకు తగిన ప్రోత్సాహం లేదు ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. పుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగ్, షూ, మధ్యాహ్న భోజనం.. ఇలాంటివి అనేకం ఉచితంగా లభిస్తున్నాయి. కానీ విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ గణనీయంగా తగ్గుతోంది. పేద, దిగువ మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారు కూడా ప్రైవేటు విద్యా సంస్థలలోనే తమ పిల్లలను చేరుస్తున్నారు.

ఉపాధ్యాయులు దీనికి గల కారణాలను కనుక్కోవడం, దాని పరిష్కార మార్గాలను చేపట్టడం చేయాలి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ గత ఐదేళ్లుగా చేపట్టలేదు. ఉన్న ఉపాధ్యాయ పోస్టులు కూడా హేతుబద్ధీకరణ పేరుతో రద్దవుతు న్నాయి. విద్యలో నాణ్యత, సంస్క రణల పేరుతో ఉపాధ్యాయులపై విపరీతమైన పని ఒత్తిడి పెరుగు తోంది. ప్రభుత్వాలు ఉపాధ్యాయుల పోస్టుల సంఖ్యను పెంచి వారిపై ఉన్న పనిఒత్తిడి తగ్గించాలి. ప్రభుత్వ పాఠశా లల్లో, కళాశాలల్లో మంచి విజయాలను సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులను సన్మా నించి, ప్రచారం చేయాలి. విద్యార్థులను తీర్చిదిద్దడంలోను, వారికి శాస్త్రీయ దృక్పథాన్ని, సక్రమ భావజాలాన్ని అలవర్చడం లోను, ఛాందస భావాలను, మూఢ నమ్మకాలను రూపుమాపడంలోను, ప్రత్యామ్నాయాలను సూచించి, నిర్మించి, నిర్వహించడంలో ఉపాధ్యాయులు ప్రధాన పాత్ర పోషిస్తారు. ఇటువంటి నేపథ్యంలో ఉన్న ఉపాధ్యాయ వర్గాన్ని ప్రభుత్వాలు గుర్తించి వారికి సరైన గౌరవాన్ని ఇవ్వాలి.

### ఉపాధ్యాయులు సామాజిక బాధ్యతను మరవద్దు

విద్యార్థులు బాల్య దశ నుంచి యుక్త వయస్సు వరకు అంటే సమాజంలో ప్రవే శించే వరకు విద్యాలయాలలో ఉంటారు. తర్వాత వారి ప్రభావం సమాజం మీద అధికంగా ఉంటుంది. సమాజంలో అడుగు పెట్టే తరుణంలో ప్రధానమైన నిర్ణాయక వయసులో వీరిని తీర్చిదిద్దవలసిన, దశాదిశలను చూపించవలసిన అవకాశం, అవసరం, బాధ్యత ఉపాధ్యాయుల మీదనే ఉంటుంది. విద్యార్థులతోనే నవ భారతం తయారవుతుంది. ఈ పరిస్థితులను ఉపా ధ్యాయులు, విద్యార్థులు సరిగా ఉపయో గించుకోకపోతే అనేక దుష్పరిణామాలకు కారణమవుతుంది. నేటి సమాజంలో జరుగుతున్న, చోటు చేసుకుంటున్న విపరీత ధోరణులకు ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధ్యాయులు కూడా కారణమవుతు న్నారు. ఉపాధ్యాయులు జాతి అవసరాలకు అనుగుణంగా సామాజిక, సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించాలి. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, సామాజికాంశాల మెళకువలు నేర్పాలి. దీనితోపాటు నిత్య



జీవితంలో ఎదురయ్యే ప్రతికూల పరిస్థితు లకు అనుగుణంగా సర్దుకుపోయే తత్వం, ఎదిరించి పరిష్కరించుకునే శక్తి సామర్థ్యా లు విద్యార్థులకు అందించాలి. తద్వారా విద్యార్థుల్లో సామాజిక చైతన్యం పెరుగు తుంది. చిన్న చిన్న విషయాలకే ఆత్మ హత్యలు చేసుకోవడం తగ్గుతుంది. విద్యాబోధనలో భాగంగా పిల్లలను, సామాజిక సంబంధాల ద్వారా, సమాజం తో మమేకం చేయాలి. కాబట్టి ప్రభుత్వా లు ప్రాథమిక విద్యను నిర్లక్ష్యం చేయడం తగదు. ప్రాథమిక స్థాయి నుంచే సాంస్కృ తిక, సాహిత్య, భాషా విషయాలను మాత్రం తప్పక నేర్పించాలి. ఉపాధ్యాయు లు విద్యార్థులకు పౌర విజ్ఞానాన్ని అందిం చాలి. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి. హక్కులనే కాదు బాధ్యతలను గుర్తు చేయాలి. సమాజపు అలవాట్లను, క్రమ శిక్షణను, వాటిని పాటించే నిబద్ధతను నేర్పాలి. ప్రజా సంస్థలలో అంతర్గత ప్రజాస్వామ్య ప్రాధాన్యతను తెలియజే యాలి. చట్టపాలనను, రాజ్యాంగ విలువ లను బోధించాలి. ఈ లక్ష్యాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలి. ఉపాధ్యా యులు విద్యా సంస్థలు వ్యాపార ధోరణు లు లేకుండా, ఫలితాన్ని ఆశించకుండా, అంకిత భావంతో బోధన చేయాలి.

ఉపాధ్యాయ- విద్యార్థుల అనుబంధం ఉపాధ్యాయ వృత్తి చాలా గౌరవప్రదమై నది. ప్రతి విద్యార్థి తమ ఉపాధ్యాయులకు తగిన గౌరవం ఇవ్వాలి. ఉపాధ్యాయుల నుండి మనం ప్రతిదీ తెలుసుకోవచ్చు, నేర్చుకోవచ్చు. ప్రతి ఒక్కరి జీవితంలో తల్లిదండ్రులే మొదటి గురువులు. తల నిమురుతూ నిజాయితీగా నడవడం నేర్పేది తల్లిదండ్రులే. మనం మంచి వ్యక్తులుగా ఉండటాన్ని మొదట మన తల్లిదండ్రుల నుండి నేర్చుకుంటాం. తర్వాత స్కూల్లో, కాలేజీలలో ఉపాధ్యాయులతో అనుబంధం ఏర్పడుతుంది. విద్యాలయాలలో కొత్త ఉపాధ్యాయులతో పరిచయాలు ఏర్పడ తాయి. అనేక అంశాలు, కొత్త పాఠాలు వారి నుంచి నేర్చుకుంటారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుడు భగవంతుని వరం లాంటివాడు. కంటితో భగవంతుని చూడలేం. కానీ తల్లిదండ్రుల తర్వాత గురువులను గౌరవ స్థానంలో ఉంచుతాం. విద్యార్థి జీవితంలో ఉపాధ్యా యుని పాత్ర విశిష్టమైనవి. ఉపాధ్యా యులంటే కేవలం చదువు మాత్రమే కాదు. చాలా మంది అకడమిక్‌గా బోధించేవారిని మాత్రమే ఉపాధ్యాయు లుగా భావిస్తారు. కానీ అది సరైనది కాదు. ఎవరి నుంచి తెలియనివి నేర్చు కుంటే వాళ్లే ఉపాధ్యాయులు అవుతా రు. తెలియని విషయాలు తెలుస్తాయి. ఏ సమయంలో నైనా ఎవరైనా ఎవరికైనా విద్యార్థి కావచ్చు. ఆ విధంగా ఉపాధ్యాయ -విద్యార్థి సంబంధం అభివృద్ధి చెందు తుంది. ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుల మధ్య స్నేహ పూర్వక సంబంధం ఉండాలి. విద్యార్థి గురువును గౌరవించి నట్లే, ఉపాధ్యాయుడు విద్యార్థి పట్ల ఆప్యాయత ప్రేమను అందించాలి. అప్పుడే ఉపాధ్యాయ-విద్యార్థుల అనుబంధం సంపూర్ణమవుతుంది. విద్యార్థుల మనసును విశ్లేషించడంలో ఉపాధ్యాయులు ఎంతో ముందుంటారు. అందుకోసం ఉపాధ్యా యులు ఆ విద్యార్థులతో ఎంతో చనువుగా మెలగుతారు, స్నేహం చేస్తారు. వారి ఆద ర్శాలను అనుసరించాలి. ఒకప్పుడు బతక లేక బడిపంతులు అనిపించుకున్న వృత్తి నేడు బతుకుకోసం బడిపంతులు అని వేనో ళ్ల కీర్తించబడుతుందంటే అందుకు కారణం సంఘ నిర్మాణంలో ఉపాధ్యాయుడు నిర్వ ర్తించిన పాత్రతప్ప మరోటి కాదు. ❑

# సుందర పర్యాటక ప్రదేశాల దేశం థాయ్‌లాండ్

షేక్ అబ్దుల్ హాకీం జాని

ప్రపంచ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న దేశం థాయ్‌లాండ్. దీనిని అధికారికంగా కింగ్‌డమ్ ఆఫ్ థాయ్‌లాండ్ అని పిలుస్తారు. ఈ దేశాన్ని స్థానిక ప్రజలు సాధారణంగా మెయాంగ్ థాయ్ అని పిలుస్తూ ఉంటారు. 1851-1868 మధ్య కాలంలో సియాం రాజ్యాన్ని మాంకట్ రాజు పరిపాలించాడు. 1939 జూన్ 23న ఈ దేశం పేరు థాయ్‌లాండ్‌గా మార్చారు. 1945 నుండి 1949 మే 11 వరకు థాయ్‌లాండ్‌ను తిరిగి సియాంగా పిలవడం ప్రారంభించారు. ఆ తరువాతి కాలంలో మళ్ళీ థాయ్‌లాండ్‌గా మార్చారు. థాయ్ అనే మాటకు స్వేచ్ఛ అనే అర్థం కూడా ఉంది. దక్షిణాసియాలో యూరోపియన్ ఆక్రమణకు గురికాని ఒకే ఒక్క దేశం థాయ్‌లాండ్.

థాయ్‌లాండ్ అన్ని దేశాలతో స్నేహ సంబంధాలు కలిగిన దేశం. ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన అతిథులను



ఇక్కడ గౌరవంగా ఆహ్వానిస్తారు. ప్రపంచంలో 51వ అతి పెద్ద దేశం ఇది. ఈ దేశంలో జనాభా సుమారు 7 కోట్ల వరకు ఉన్నారు. థాయ్‌లాండ్ దేశం బౌద్ధ మతానికి ప్రసిద్ధి చెందింది. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్. ఈ దేశానికి రాజు ఉన్నాడు. ఇది ప్రజాస్వామ్య దేశమైనప్పటికీ రాజుకు వ్యతిరేకంగా ఏమీ జరగదు. ఈ దేశం ప్రపంచ యువ పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తుంది. భక్తి, రక్తి, శృంగారం కలగలసిన దేశం థాయ్‌లాండ్.

## బ్యాంకాక్

ఇది థాయ్‌లాండ్ రాజధాని నగరం. ఎనిమిది మిలియన్ల జనాభాతో థాయ్‌లాండ్‌లో ప్రముఖ పర్యాటక ప్రదేశంగా విరాజిల్లుతోంది. ఇంద్ర స్కేర్, ప్లాటినమ్ మాల్ వంటి అతి పెద్ద షాపింగ్ మాల్స్ ఉన్నాయి. థాయ్‌లాండ్‌ను సందర్శించడానికి వచ్చే పర్యాటకుల సంఖ్య కంటే బ్యాంకాక్‌కు వచ్చే పర్యాటకుల సంఖ్య రెట్టింపు ఉంటుంది. నవరత్నాలకు కేంద్ర స్థానం బ్యాంకాక్ అని చెబుతుంటారు. బ్యాంకాక్ నగరం మధ్యలో ఛోప్రాయా నది ప్రవహిస్తుంది. ఈ నదిపై క్రూయిజ్ షికారు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది.

## ఎత్తైన ఆకాశహర్మ్యం

బ్యాంకాక్‌లో ఉన్న ఈ ఆకాశహర్మ్యం థాయ్‌లాండ్‌లోనే ఎత్తయిన భవనం. దీని ఎత్తు యాంటెన్నాతో కలుపుకుని 328.4 మీటర్లు. 1997లో ఈ భవన నిర్మాణం పూర్తి చేసారు. 83వ అంతస్తులో నిర్మించిన హోటల్‌లో 673 గదులున్నాయి. 77వ అంతస్తులో పర్యాటకులు విహంగ వీక్షణం చేసేందుకు అనువైన ఏర్పాట్లు చేసారు.

## టెంపుల్ ఆఫ్ డాన్

ఇది ఛోప్రాయా నదికి పశ్చిమ తోన్‌బురి ఒడ్డున ఉన్న ప్రాచీన దేవాలయం. వాట్ అరుణ్ అని పిలుస్తున్నప్పటికీ స్థానిక ప్రజలు వాట్ చెయాంగ్ అని పిలుస్తుంటారు.

## గ్రాండ్ ప్యాలెస్

ఒకప్పటి సియామ్ రాజుల అధికారిక నివాసం భవనం. ఈ అద్భుతమైన భవన సముదాయం అనేక తరాలుగా రాజ కుటుంబీకుల నివాసంగా విరాజిల్లింది. ఇందులో చక్రి మహాప్రసత్ అని పిలిచే గ్రాండ్ ప్యాలెస్ హాలు ఈ కోటలోని భవనాలలో అతిపెద్దది. వీటితో పాటు అమరేంద్ర హాల్, చుసిత్ హాల్ చూడదగినవి.

## చతుచక్ మార్కెట్

ఇది థాయ్‌లాండ్‌లో అతి పెద్ద మార్కెట్. ప్రపంచంలోని అతిపెద్ద బహిరంగ మార్కెట్లలో ఒకటి. స్థానికంగా జెజె మార్కెట్ అని పిలుస్తారు. ఈ మార్కెట్ అయిదు ఎకరాలలో విస్తరించి ఉంది. దుస్తులు, ఉపకరణాలు, హస్తకళలు, ఫర్నిచర్, ప్రాచీన వస్తువులకు నెలవై ఉంది.

## నేషనల్ మ్యూజియం

ఆగ్నేయాసియాలో ఇది అతిపెద్ద మ్యూజియం. బ్యాంకాక్ నేషనల్ మ్యూజియం థమ్మసాట్ విశ్వవిద్యాలయం-నేషనల్ థియేటర్ మధ్య సనమ్ లుయాంగ్ పార్క్ వద్ద ఉంది. దీన్ని 1887లో స్థాపించారు. థాయ్‌కు చెందిన చారిత్రక కళాఖండాలను ఇక్కడ చూడవచ్చు. ఆగ్నేయాసియాలో అతిపెద్ద మ్యూజియంగా ప్రసిద్ధి చెందింది.

## పచ్చ బుద్ధ ఆలయం

థాయ్‌లాండ్‌లోని పవిత్రమైన బౌద్ధ ప్రదేశం. ఈ ప్రాచీన బౌద్ధ ఆలయాన్ని వాట్ ఫ్రా కైవ్, ఎమరాల్డ్ బుద్ధ ఆలయం మొదలైన పేర్లతో పిలుస్తారు. ఈ ఆలయంలో పచ్చ బుద్ధుని ప్రతిమ ఉంది. దీన్నే ఫ్రా కైవ్ మొరాకోట్ అని కూడా పిలుస్తారు.

## వాట్ ఫో

అతి పురాతన దేవాలయమిది. ఇది బ్యాంకాక్‌లోని అతి పెద్ద ఆలయ సముదాయాలలో ఒకటి. ఎనిమిది హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న ఈ ఆలయంలో 46 మీటర్ల పొడవున్న బౌద్ధ విగ్రహం ప్రత్యేక ఆకర్షణ. వాట్ ఫో, ది టెంపుల్ ఆఫ్ ది రిక్లైనింగ్ బుద్ధ అని ప్రజలు పిలిచే ఈ ఆలయం గ్రాండ్ ప్యాలెస్ ఆవరణకు నేరుగా దక్షిణాన రత్తనాకోసిన్ ద్వీపంలో ఉంది. శయన భంగిమలో ఉన్న అతి పెద్ద బుద్ధుని విగ్రహం ఉందిక్కడ. థాయ్‌లాండ్‌లో దాదాపు 35 వేల ఆలయాలు ఉన్నాయి. థాయ్ లాండ్‌ను దేవాలయాల భూమి అని కూడా పిలుస్తారు.



## ఎరావాన్ పుణ్యక్షేత్రం

థాయ్‌లాండ్‌లో బ్రహ్మ కోసం నిర్మించిన మందిరమిది. దీనిని థావో మహాబ్రోమ్ పుణ్యక్షేత్రం అని కూడా పిలుస్తారు.

**పుకెట్:** థాయ్‌లాండ్‌లోని అతిపెద్ద ద్వీపం పుకెట్. పుకెట్ సహజమైన బీచ్‌లు, వాటర్ స్పోర్ట్స్‌లకు ప్రసిద్ధి చెందింది. సుందర కొండల నడుమ సాగర అందాలు స్వర్గంలా కనిపిస్తుంది. నై హార్న్ బీచ్, సురిన్ బీచ్, కటా నోయి బీచ్‌లు ప్రముఖమైనవి. ఈ ప్రదేశంలో మసాజ్ పార్లర్లు కూడా అధికంగా ఉంటాయి. ఏడాది పొడవునా ఇక్కడికి పర్యాటకులు వస్తుంటారు.

**కో టావో:** థాయ్‌లాండ్‌కు ఆగ్నేయంలో చుంఫోన్ ద్వీపాల సమూహంలో కో టావో ద్వీపం ఉంది. ఇది స్కూబా డైవింగ్, స్నార్కెలింగ్‌తో పాటు ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్ చేయవచ్చు. సముద్ర తాబేళ్లకు కూడా ఇది ప్రసిద్ధి చెందింది. ఇక్కడి బీచ్‌లో తెల్లని ఇసుక ఉండటం విశేషం.

## కో ఫై ఫై దీవులు

థాయ్‌లో కోహ్ అంటే ద్వీపం అని అర్థం. ఆరు ద్వీపాలు ఫై ఫై ద్వీపాల సమూహంగా ఉన్నాయి. ఆరింటిలో అత్యంత ప్రసిద్ధి చెందిన రెండు ద్వీపాలు ఫి ఫై డాన్, ఫై ఫై లేహ్. ఇవి పుకెట్ నుండి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. థాయ్‌లాండ్‌లో కొన్ని రోజులు గడపడానికి పర్యాటకులు ఇష్టపడే గొప్ప ప్రదేశం ఫై ఫై దీవులు. ఇక్కడి ఎత్తయిన కొండలు, స్వచ్ఛమైన సముద్ర జలాలు, బీచ్‌లో తెల్లని మెరిసే ఇసుక, పచ్చని వృక్ష సంపద కలగలిపి భూతల స్వర్గంలా కనిపిస్తుంది. లాంగ్ బీచ్, కో చాంగ్ బీచ్, మాయా బే సందర్శించదగినవి.

## పట్టాయ

బ్యాంకాక్‌కు ఆగ్నేయంగా 147 కి.మీ. దూరంలో గల్ఫ్ ఆఫ్ థాయ్‌లాండ్‌లోని సముద్రతీర రిసార్ట్ పట్టాయా. ఆసియాలో ఒక ప్రధాన బీచ్. స్కూబా డైవింగ్, గేమ్ ఫిషింగ్, గోల్ఫింగ్ ఇత్యాది నీటి వినోదాలతో పాటు మసాజ్‌కు చాలా ప్రసిద్ధి చెందింది. థాయ్ మసాజ్ అంటే ప్రపంచంలో పెట్టింది పేరు. మసాజ్ చేయించుకోవడానికి డబ్బున్న బడాబాబులు పట్టాయకు వస్తుంటారు. వ్యభిచారం, మద్యపానం, ఓపెన్ బార్లు, క్లబ్బులు, పబ్బులు, మాదకద్రవ్యాలు... ఇలా అన్ని కార్యక్రమాలు బహిరంగంగానే జరుగుతుంటాయి. డబ్బున్నవాడు ఇక్కడ సుఖపడ్డట్టు ప్రపంచంలో ఎక్కడా సుఖపడలేడేమో? అన్నంతగా ప్రపంచ ధనికుల్ని పట్టాయ ఆకర్షిస్తుంది. మసాజ్ సెంటర్లలో అన్నీస్ మసాజ్ సెంటర్, క్రిస్టీనా మసాజ్ సెంటర్ చాలా ప్రముఖమైనవి. థీమ్ పార్కులు, మ్యూజియంలు, బొటానికల్ గార్డెన్‌లు ఇక్కడ చూడదగినవి. పట్టాయాలోని ఉత్తరం, మధ్య, దక్షిణం మూడు ప్రాంతాలు



వేటికవే ప్రత్యేకతను కలిగి ఉంటాయి. పట్టాయాలో పులుల పార్క్ చాలా ప్రసిద్ధి చెందింది. పర్యాటకులు ఈ పెద్ద పులులతో సాధు స్వభావం గల జింకపిల్లలతో ఆడుకున్నట్లు ఆడుకోవచ్చు. స్నేహపూర్వకంగా మెలిగే ఇక్కడి పెద్దపులులు పిల్లిపిల్లల్లా పర్యాటకులతో కలిసిపోవడం విశేషం. పట్టాయాలో ఫ్లోటింగ్ మార్కెట్ చూడదగింది. దీన్ని నీటి మార్కెట్, నీటిపై తేలియాడే మార్కెట్ అంటారు. దీన్ని 2008లో పట్టాయాలో స్థాపించారు. చిన్న పడవలపై మనకు కావలసిన పండ్లు, ఆహార పదార్థాలు, దుస్తులు, హస్తకళా వస్తువులు అమ్ముతుంటారు. థాయ్ సంస్కృతికి ప్రతిరూపంలా ఈ నీటి మార్కెట్ కనిపిస్తుంది.

## చియాంగ్ మాయి

దీన్ని ఉత్తర రాజధానిగా పిలుస్తుంటారు. థాయ్‌లాండ్ జాతీయ జంతువు ఏనుగు. చియాంగ్ మాయిలో ఉన్న ఎలిఫెంట్ నేచర్ పార్క్ ఆసియా ఏనుగుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం. థాయ్‌లాండ్‌లో తెల్ల ఏనుగులు ఉండటం వల్ల దీన్ని తెల్ల ఏనుగుల దేశం, ఐరావతాల దేశం అని పిలుస్తారు. ఈ ఏనుగులు పూర్తి స్థాయి తెల్లగా ఉండవు. సాధారణ ఏనుగుల రంగు కంటే కొంచెం లేతగా ఉంటాయి. ఇది హైకింగ్, సైక్లింగ్, రాఫ్టింగ్, అవుట్‌డోర్ క్రీడలకు ప్రసిద్ధి చెందింది. పలు దేవాలయాలు, మఠాలు, చారిత్రక ప్రదేశాలు, పచ్చని వృక్షాలతో అలరారుతుంది. డోయి ఇంతనాన్ నేషనల్ పార్క్ జలపాతాలు, ఎలిఫెంట్ జంగిల్ అభయారణ్యం, పటారా ఎలిఫెంట్ ఫామ్ వంటి ఏనుగుల పెంపకం కేంద్రం సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తాయి. చియాగంగ్ మాయిలో టైగర్ కింగ్‌డమ్‌లో పెద్ద పులులను తిలకించవచ్చు. కొండల్లో విహార యాత్రలో, ప్రాచీన బౌద్ధ దేవాలయాలు, మంచుతో నిండిన పర్వత శ్రేణులు, పొగ మంచుతో నిండిన అరణ్యాలు చియాంగ్ మాయిలో అదనపు ఆకర్షణ.

## క్రాబి

ఇది థాయ్‌లాండ్‌లో ఆధునిక, పురాతన మిశ్రమ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. దాదాపు 200 ద్వీపాలతో ఇది రూపొందింది. వీటిలో అనేక ద్వీపాలను జాతీయ ఉద్యానవనాలుగా తయారు చేసారు. తీర ప్రాంతంలో బీచ్‌లు, సముద్ర జలాల్లో వర్ణనాతీత అందాల ద్వీపాలు ఉన్నాయి. పార్టీలు చేసుకునేవారు ఇక్కడకు ఎక్కువగా వస్తుంటారు. కోరల్ డైవింగ్, రాక్ క్లైంబర్లు సైతం వస్తుంటారు.

## అయుతాయ

థాయ్‌లాండ్‌లోని అత్యంత ప్రాచీన నగరాలలో ఇది ఒకటి. దీని పూర్తి పేరు ఫ్రా నఖోన్ సి అయుతయ. అనేక సుందర ఆలయాలు, రాజభవనాలు, మఠాలు, పురాతన నిర్మాణాలు ఉన్నాయి. బ్యాంకాక్‌కు ఎనభై కి.మీ. దూరంలో వున్న ఈ నగరం వినోద పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందింది. దీన్ని స్థానికులు క్రుంగ్ కావో(పాత రాజధాని) అని పిలుస్తారు. ఈ నగరం వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ, కళలు, సంస్కృతికి కీలకమైన కేంద్రంగా అభివృద్ధి చెందింది. 14వ శతాబ్దంలో సియామ్ పాలనలో ఇది దేశ రాజధానిగా విరాజిల్లింది. ఆ నగర శిథిలాలు కూడా ఇప్పటికీ ఉన్నాయి.

## ఫాంగ్ న్గాబే

కో స్యామ్యూయ్-కో టావో మధ్య చుంఫోన్ ద్వీప సమూహంలో భాగంగా కో ఫా న్గాన్ ద్వీపం ఉంది. లియోనార్డో డి కాప్రియా నటించిన ది బీచ్ చిత్రం ద్వారా ఫాంగ్‌న్గా బే ప్రసిద్ధి చెందింది. హాడ్ రిన్ పౌర్ణమి వేడుకలకు ఈ ప్రదేశం ప్రసిద్ధి చెందింది. షిప్పింగ్, కొబ్బరి పరిశ్రమల ద్వారా ఆదాయం వస్తుంది. ఇది థాయ్‌లాండ్‌లో అందరికీ తెలిసిన పర్యాటక ప్రదేశం. ఇక్కడ ఉన్న జలపాతాలు అదనపు ఆకర్షణ. ఫిషింగ్ ట్రిప్‌లు, డైవింగ్, కైట్‌బోర్డింగ్ ఇత్యాదివి పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తాయి. కో ఫాన్గన్ పర్యాటకులకు వినోదాన్ని అందించే పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. కొన్ని సందర్భాలలో ఈ ప్రదేశాన్ని ధ్యాన కేంద్రంగా పిలుస్తారు.

## చియాంగ్ రాయ్

ఉత్తర థాయ్‌లాండ్‌లో లావోస్-మయన్మార్‌ల సరిహద్దుల సమీపంలో చియాంగ్ రాయ్ పర్వత నగరం ఉంది. దీన్ని వాట్ రోంగ్ ఖున్ అని కూడా పిలుస్తారు. మెకాంగ్ నదిని ఆనుకుని ఇది చారిత్రాత్మక బౌద్ధ దేవాలయం. థాయ్‌లాండ్ సంప్రదాయ బౌద్ధ దేవాలయాలకు ఇది భిన్నంగా కనిపిస్తుంది. మెకాంగ్ పడవలో ప్రయాణిస్తూ చియాంగ్ రాయ్ ప్రకృతి అందాలను తిలకించవచ్చు. ఇది చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాల సంపదగా విరాజిల్లుతుంది. ఒకప్పుడు చియాంగ్ రాయ్ ప్రాంతంలో నల్లమందు వ్యాపారం ఎక్కువగా జరిగేది.

## ఎరావాన్ నేషనల్ పార్క్



ఎరావాన్ నేషనల్ పార్క్ థాయ్‌లాండ్‌లోని ఒక ప్రత్యేక పర్యాటక ప్రదేశం. ఇక్కడ దట్టమైన అరణ్యాలు, ఏనుగులు, విష సర్పాలు, థామ్ ఫ్రా దట్ గుహలు, ఏడు అంచెల ఆక్వా జలపాతాలు, కాంచనబురి జలపాతాలు, హుయే మేఖమిన్ జలపాతం, శ్రీనకరిన్ డ్యామ్ ఇత్యాదివి చూడదగిన ప్రదేశాలు. ఎరావాన్ అన్నీ ఉష్ణమండల అరణ్యాలు, ఏనుగులు, నాగుపాములు, గిబ్బన్‌లలో కనిపిస్తాయి. అపారమైన థామ్ ఫ్రా దట్ గుహలు, ఏడు అంచెల ఆక్వా జలపాతాలు కూడా ఉన్నాయి. ఇవి ఈతకు సరైనవి. శ్రీనకరిన్ డ్యామ్, నేషనల్ పార్క్ మొదలైన ప్రదేశాలకు విహార యాత్రకు వెళ్లవచ్చు. పశ్చిమ థాయ్‌లాండ్‌లోని ఖ్వే నోయి, ఖ్వే యాయ్ నదుల సంగమం వద్ద



కాంచనబురి ప్రావిన్స్ పురాతన వర్షారణ్యాలు, జలపాతాలు, సున్నపురాయి గుహలతో అలరారుతుంది. థాయ్‌లాండ్ మైక్రోకోజమ్ అని పిలుచుకునే కాంచనబురితో పాటు చిక్ రిసార్ట్ పట్టణాలు, సుందరమైన రిజర్వాయర్లు, పగోడాలు, చారిత్రక స్మారక చిహ్నాలు, ట్రెక్కింగ్, గోల్ఫింగ్, వైట్-వాటర్ రాఫ్టింగ్ మొదలైన వాటికి నిలయం. థాయ్‌లాండ్‌లోని అన్ని పర్యాటక ప్రదేశాలలో ఇది తప్పనిసరిగా సందర్శించవలసిన ప్రదేశం.

## ఖావో యాయ్ నేషనల్ పార్క్

ఖావో యాయ్ నేషనల్ పార్క్‌ను 1962లో స్థాపించారు. థాయ్‌లాండ్‌లోని మూడవ అతిపెద్ద ఉద్యానవనం. ఇది థాయ్‌లాండ్‌లోని రద్దీగా ఉండే ప్రాచీన జాతీయ ఉద్యానవనం. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందింది. సముద్ర మట్టానికి 1300 మీటర్ల ఎత్తులో ఇది నెలకొని ఉంది. దట్టమైన చెట్లతో నిండిన రాతి పర్వతాలు, జలపాతాలు, అసాధారణమైన మొక్కలు, 300లకు పైబడి విభిన్నమైన పక్షిజాతులు, ఎలుగుబంట్లు, ఏనుగులు, చిరుతపులులు, పెద్దపులులు, లష్ మాన్సూన్ అడవులను ఇక్కడ తిలకించవచ్చు.

## సుఖోథాయ్

ఇది 700 సంవత్సరాల ప్రాచీన నగరం. థాయ్ నాగరికతకు ప్రతిరూపంగా భావించే సుఖోథోయ్ యునెస్కోవారిచే ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందింది. సుఖోథాయ్ హిస్టారికల్ పార్క్‌లో చాలా స్మారక చిహ్నాలు, శిథిలాలను పునరుద్ధరించారు. థాయ్‌లాండ్‌లో ఇంకా చూడదగిన ప్రదేశాలలో హువా హిన్, కాంచనబురి, కావో సామ్ రోయ్ యోట్ నేషనల్ పార్క్ ఇత్యాది అనేక పర్యాటక ప్రదేశాలున్నాయి. ముఖ్యంగా ఫుకెట్ సమీపంలో అనేక చిత్రాలను చిత్రీకరించారు. ఫాంగ్ న్గా బేలో ఉన్న ఈ దీవి అసలు పేరు ఖావో ఫింగ్ కాన్. 1974లో ఇక్కడ 'ది మ్యాన్ విత్ ది గోల్డెన్ గన్' అనే జేమ్స్‌బాండ్ చిత్రాన్ని చిత్రీకరించారు. నాటి నుండి దీనిని జేమ్స్‌బాండ్ ఐలాండ్ అని పిలుస్తున్నారు.

ఇప్పుడు ఇది థాయ్‌లాండ్‌లో ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది.



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక రుణాలు తీర్చి ఊరట పొందుతారు. క్రయ-విక్రయాలు యథాతథం. వారమంతా ఉత్సాహంగా గడుస్తుంది. వాహన యోగం. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం మంచిది. కింది స్థాయి ఉద్యోగులతో మాట్లాడేటప్పుడు సంయమనం కోల్పోకండి. దుర్వ్యసనాలకు దూరంగా వుంటే ఆరోగ్యరీత్యా మంచిది.

## వృషభం



దేశాంతర ప్రయాణ సూచనలు ఉన్నాయి. బంధు, మిత్రులను కలుసుకుంటారు. సామాన్య ధన లాభం. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించడం శ్రేయస్కరం. శుభ కార్యాల్లో పాల్గొంటారు. వృద్ధుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తారు. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. అన్ని వ్యవహారాల్లో విజయం సాధిస్తారు. ప్రముఖులను సందర్శిస్తారు.

## మిథునం



శుభ కార్యాలు నిర్వహిస్తారు. వ్యాపారులు అధిక రుణాలు చేయాల్సి వస్తుంది. ఆరోగ్య సమస్యలు ఉంటాయి, సహనంతో వ్యవహరించడం మంచిది. రుణాలు తీర్చడంలో ఇబ్బందులు ఉంటాయి. సామాజిక సంఘర్షణకు లోనవుతారు. ఉద్యోగులకు ఆర్థికంగా ఆశించిన ఫలితాలు ఉంటాయి. వృథా వాదోపవాదాలకు దూరంగా వుండండి.

## కర్కాటకం



విశేష వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆరోగ్యం బాగుంటుంది. శుభ కార్యాల్లో పాల్గొంటారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. వాహన యోగం. వ్యాపారులకు కొన్ని చోట్ల స్వల్ప ధన నష్ట సూచనలున్నాయి. ఉన్నతాధికారం లభిస్తుంది. మిత్రులను కలుసుకుంటారు.

## సింహం



రుణాలు తీర్చి ఊరట పొందుతారు. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. భాగస్వామ్య వ్యాపారులకు మనస్పర్థలు. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. బంధు, మిత్రులను కలుసుకుంటారు. అకారణంగా మానసిక ఆందోళన చెందుతారు. కుటుంబ సమేతంగా శుభ కార్యాల్లో పాల్గొంటారు. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం శ్రేయస్కరం.

## కన్య



భాగస్వామ్య వ్యాపారులు సంయమనంతో సమస్యలు పరిష్కరించుకుంటారు. కుటుంబ సమస్యలు ఉంటాయి. రుణాలు తీర్చడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. వ్యాపారులకు రుణాలు మంజూరవుతాయి. కళాకారులకు సన్మాన యోగం. వ్యతిరేకతలు ఎదురైనా సకాలంలో పనులు పూర్తి చేస్తారు.

## తుల



ఆకస్మిక ధన లాభ సూచనలున్నాయి. బంధు, మిత్రులను కలుసుకుంటారు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక సమస్యలు వారాంతంలో పరిష్కారం. ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ సభ్యుల మధ్య మనస్పర్థలకు అవకాశాలున్నాయి. ప్రశాంతత కరువవుతుంది. బాల్య మిత్రులను కలుసుకుంటారు. ఉద్యోగాభివృద్ధి సంతృప్తిని ఇస్తుంది. వృత్తి విద్యలు అభ్యసించిన వారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

## వృశ్చికం



పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. వృత్తి వ్యాపారులకు ఆర్థికంగా బాగుంటుంది. విందు-వినోదాల్లో పాల్గొంటారు. దేశాంతర ప్రయాణ సూచనలున్నాయి. బంధు, మిత్రులతో మనస్పర్థలకు అవకాశం. సంయమనంతో వ్యవహరించడం అన్ని విధాలా శ్రేయస్కరం. అకారణంగా ఆందోళనకు లోనవుతారు. ధర్మ రక్షణకై పాటుపడతారు. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేసి ప్రశంసలు పొందుతారు.

## ధనుస్సు



దేశాంతర ప్రయాణ సూచనలున్నాయి. బంధు, మిత్రులను కలుసుకుంటారు. సామాన్య ధన లాభం పొందుతారు. వృత్తి ఉద్యోగాల్లో వున్నవారికి ప్రతికూలతలు ఉంటాయి. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం చెప్పదగిన సూచన. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉద్యోగులకు ఆశించిన ఫలితాలు ఉంటాయి. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించడం చాలా అవసరం. శుభ వార్తలు వింటారు.

## మకరం



దీర్ఘకాలిక సమస్యలు వారాంతంలో పరిష్కారం అవుతాయి. ఉద్యోగులకు ఆశించిన పదోన్నతి లభిస్తుంది. సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. భాగస్వామ్య వ్యాపారులకు బాగుంటుంది. ఆలోచనల్లో స్థిరత్వం ఏర్పడుతుంది. విద్యార్థులకు శుభ యోగం. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించడం అత్యవసరం. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. నిరుద్యోగులకు కోరుకున్న ఉద్యోగం లభిస్తుంది.

## కుంభం



రుణాలు చేస్తారు. అనుకోని సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. గృహ సౌఖ్యం. శత్రు బాధలు సమసిపోతాయి. వ్యాపారులకు యథాతథంగా ఉంటుంది. ఆరోగ్య సమస్యలు ఉంటాయి, సహనం అలవరచుకుంటే మంచిది. బాల్య మిత్రులను కలుసుకుంటారు. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. ఉద్యోగులకు స్థాన చలనం/పదోన్నతి.

## మీనం



ఆర్థికంగా ఆశించిన ఫలితాలు ఉంటాయి. రుణాలు తీరుస్తారు. క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి. గృహ సౌఖ్యం. ఆరోగ్య సలహాలు, సూచనలు తూచా తప్పకుండా పాటించండి. వృత్తి వ్యాపారులకు యథాతథంగా ఉంటుంది. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. చిరు వ్యాపారులకు శ్రమ అధికం. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. విలువైన వస్తువులు కొనుగోలు.

# ఈశాన్యంలో బావి వుంటే ?


వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458




### తూర్పు బావి(ఉచ్ఛమ స్థానం) శుభం

ఇంటికి తూర్పు మధ్య భాగం నుండి ఉచ్ఛమ స్థానమైన ఈశాన్యం వైపుకు బావి ఉన్నట్లయితే సత్ఫలితాలుంటాయి. బావి చుట్టూ వుండే నేల తూర్పు/ఉత్తర/ఈశాన్య పల్లం అయితే శుభ ఫలితాల సాంద్రత పెరుగుతుంది.

**శుభా శుభ ఫలితాలు:** పలుకుబడి, పేరు ప్రఖ్యాతులు, ఆర్థిక లబ్ధి, సౌఖ్యం, ప్రశాంతత.

**Eastern Well(low-grade location)-Mixed**

If a well is dug in the middle of the East or in the North-East (Low-grade location) avoiding strike with the corner of the house, the effects are neither significantly harmful nor gainful.



**Likely Result:** Mixed.

### తూర్పు బావిపోటు-అశుభం

ఇంటి ఉత్తరపు గోడ పొరు నుండి తూర్పు ప్రహరీగోడకు తాడు పట్టి లాగినప్పుడు అది తూర్పున ఉన్న బావి మీదుగా పోతే ఆ ఇంటికి తూర్పు బావిపోటు దోషం ఉన్నట్లుగా గ్రహించాలి. బావి తూర్పున ఉన్నప్పటికీ ఈ బావిపోటు దోషం వలన అనేక చెడు ఫలితాలుంటాయి.

**శుభా శుభ ఫలితాలు:** ఆర్థిక నష్టం, ఆరోగ్య నష్టం, అవమానాలు.

**Eastern Well(strike)-Unfavourable**

If a string, held straight from the Eastern boundary of the house to the Northern compound wall, encounters a well then it should be considered as a strike of the Eastern well.

**Likely Result:** Monetary losses, ill-health, insults.

### తూర్పు ఈశాన్య బావి-శుభం

ఇంటి నుండి ఏ విధమైన పోటు లేకుండా తూర్పు ఈశాన్యంలో బావి ఉన్నట్లయితే అది ఆ ఇంటిల్లిపాదికీ సత్ఫలితాలనిస్తుంది. బావి చుట్టూ వుండే నేల తూర్పు/ఉత్తర/ఈశాన్య పల్లం అయితే శుభ ఫలితాల సాంద్రత పెరుగుతుంది.

**శుభా శుభ ఫలితాలు:** ఆత్మ స్థైర్యం, ధన లాభం, వంశాభివృద్ధి, సద్బుద్ధి, ధనధాన్య సమృద్ధి.

**East North-Eastern Well-Favourable**

Whether there is a strike or not, if there is a well is in the East North-East there are favourable effects. If the ground surrounding the well is at lower level in the East or North, the favourable effect get increased.

**Likely Result:** Stable mind, monetary gains, increase in family members, good nature, prosperity.

### తూర్పు ఈశాన్యంలో బావి-అశుభం

ఇంటికి తూర్పున ఉన్న ఖాళీ స్థలమంతా వదిలేసి ఇంటికి దగ్గరగా తూర్పు ఈశాన్యంలో బావి తవ్వుతారు. ఉద్దేశం ఏమైనపటికీ ఇలా బావులు తవ్వడం వల్ల పరిణామాలు ప్రమాదకరంగా ఉంటాయి. తూర్పున వీధి ఉంటే దుష్ఫలితాల తీవ్రత అధికం.

**శుభా శుభ ఫలితాలు:** అభద్రతా భావం, మనోచాంచల్యం, పరాధీన తత్వం.

**East North-Eastern Well-Unfavourable**

When the house does not have any kind of strike a well in the East North-East gives unfavourable results. **Likely Result:** Feeling of insecurity, fickle-mindedness, dependence.

### ఈశాన్యంలో బావి-అశుభం

ఇంటికి ఈశాన్యంలోని ఖాళీ స్థలమంతా వదిలి, ఇంటికి దగ్గరగా ఈశాన్యంలో బావి తవ్వడం దారుణమైన చెడు ఫలితాలనిస్తుంది. **శుభా శుభ ఫలితాలు:** అభద్రతా భావం, మనో చాంచలత్వం, పరాధీనతత్వం తీవ్రతరం.

**North-Eastern Well-Unfavourable**

There should not be a well wholly in the North-East corner. When a string is held straight from either the North-East corner of the house or from the South-East of the plot to the North-West of the plot, gives unfavoura ble results. **Likely Result:** Feel ing of insecurity, fickle-minded-ness, extreme dependence.

### ఉత్తర ఈశాన్యంలో బావి-అశుభం

ఇంటికి ఉత్తరంలో వున్న ఖాళీ స్థలమంతా ఖాళీగా వదిలి, ఇంటికి ఆనుకొని ఉత్తర ఈశాన్యంలో బావి తవ్వడం అనేక దుష్పరిణామాలకు దారితీస్తుంది. ఉత్తరాన వీధి ఉంటే దుష్పరిణామాల తీవ్రత ఎక్కువవుంటుంది.

**శుభా శుభ ఫలితాలు:** అభద్రతా భావం, మనోచాంచలత్వం, పరాధీన తత్వం తీవ్రతరం.

**North North-Eastern Well-Unfavourable**


When the house does not have any kind of strike a well in the North North-East gives unfavoura ble result. If the ground surrounding the well is at lower level in the West or South, the unfavorable effects get increased. **Likely Result:** Feeling of insecurity, fickle-mindedness, dependence.

### కుడ్యవేధ బావి-అశుభం

సరైన స్థలంలో బావి ఉన్నప్పటికీ దాని మీదుగా ప్రహరీ గోడలు కట్టినప్పుడు లేదా ప్రహరీగోడల పునాదులలోకి చొప్పిస్తూ బావి కట్టినప్పుడు ఆ బావికి కుడ్యవేధ ఏర్పడుతుంది. ఇటువంటి బావులు ఉండవలసిన చోట ఉన్నప్పటికీ చెడు ఫలితాలు ఇస్తాయి. ఉండకూడని చోట కూడా ఈ బావులు ఇటువంటి దోషంతో ఉన్నప్పుడు తీవ్రమైన చెడు ఫలితాలుంటాయి.

# పదరంగం-4

కూర్పు: పోపూరి విశ్వనాథ్



## ఆధారాలు

### అడ్డం


1) కాలం కలిసివచ్చినవాడు (5)
4) గుబురు, గోపురం, బెలూన్ లాంటిది (3)
6) కలిసి ఆనందంగా ఉండాలంటే ఇవి కలవాలి (4)
7) నెరవేరు (3)
8) అటునించి వచ్చిన కీడు (2)
9) మొగుడూ పెళ్లాలు (5)
12) చోటు, దూరం (2)
13) ఉంగరపు వేలు (4)
15) సోమరి (5)
17) మిరప రుచి (2)
18) చిట్టచివరికి (5)
21) పూలచెండ్ల కొలత (2)
22) గ్రామాల్లోని సమావేశపు గద్దె (4)
23) వరంగల్లులో కొలువైన ఒక అమ్మవారు (4)


### నిలువు


1) ప్రముఖ వాగ్గేయకారుడు (4)
2) 9 నిలువులోని వారు చెదరిపోయిన వీటిని కలిసి అనుభవించాలట (5)
3) బయలుదేరుతుంటే ఎవరికైనా ఇది వస్తే అపశకునమంటారు (2)
4) పాలు తోడుపెడితే అయ్యేది విరిగిపోయింది (3)
5) దగ్గర, వాడుక భాషలో దొంగతనం (తలకిందులైంది) (4)
7) ఇవి వాలిన ఆహారం తినకూడదట! (3)
9) దర్పం, హడావిడి లాంటిది (4)
10) అరచేతిని మోచేతిని కలిపేది (4)
11) నమ్మకంపై ఏదైనా వస్తువును అరువుగా ఇచ్చుట (4)
14) చెదరిపోయిన చెడ్డ కవి (3)
16) పైకొచ్చిన దుష్యంతుని కొడుకు (4)
17) చేదు కూరగాయ (3)
19) సంస్కృతంలో అరటి అటూ ఇటూ అయింది (3)
20) సేవకుడు సరిగా లేడు (2)

## పదరంగం-2 జవాబులు





ఇంకొక్క బీర్ తాగనిస్తే.. ఖాళీ సీసాల డబ్బుల్తో ఈనెల పని మనిషి జీతం వెళ్ళిపోతుందండీ..!!
Zakir...


..చంద్రుడి మీద తీసుకున్నవనుకో.. రోజూ రాత్రి ప్లాటు చూసుకోవచ్చు!
Zakir...


అయ్యో.. ఈసారి కూడా నెల తప్పలేదా? నెలకి మూడు ప్రసవాలు చేయించాలని టార్గెట్టిచ్చా..!!
Zakir...

ఈ వారం కా'ర్టూన్స్'



‘స్టోన్ రివర్’ గా పేరు పొందిన ఈ నది రష్యాలో ఉంది. యూరల్స్‌లోని టాగనేయ్ పర్వతాల్లో పుట్టిందీ నది. రాళ్ల మధ్యలో నుంచి పాయలు.. పాయలుగా ప్రవహిస్తుంది నీరు. ఈ నదిలోని రాళ్లు పేర్చినట్లుగా ఓ క్రమ పద్ధతిలో ఉండటం విశేషం. ఈ రాళ్ల నదిని చూడటానికి ప్రపంచంలోని నలు మూలల నుండి పర్యాటకులు అధిక సంఖ్యలో విచ్చేస్తుంటారు.









